# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

అమరావతి
శనివారం
28-09-2024
వెల. రూ.5
• సంపుటి : 8 • సంచిక: 277
పేజీలు : 8

Amaravathi | Tirupathi | Kurnool | Eluru | Visakhapatnam | Ananthapuramu | Kadapa | Hyderabad | Karimnagar | Nizamabad | Nallagonda | Mahaboobnagar | Warangal | Khammam




## పథకాలకు నిధులివ్వండి

### ప్రధాని మోడీతో స్టాలిన్ భేటీ

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 27 :** తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ శుక్రవారం నాడిక్కడ ప్రధాని నరేంద్ర మోడీని కలుసుకుని వివిధ సంక్షేమ పథకాల అమలు కోసం పెండింగ్ నిధులను రాష్ట్రానికి త్వరితగతిన విడుదల చేయాలని కోరారు. తమిళనాడుకు చెందిన మత్స్యకారుల ప్రయోజనాలను కాపాడేందుకు స్వయంగా జోక్యం చేసుకోవాలని కూడా స్టాలిన్ ప్రధాని మోడీని అభ్యర్థించినట్లు రాష్ట్ర అధికారి ఒకరు తెలిపారు. సమావేశం అనంతరం స్టాలిన్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నాయకురాలు సోనియా గాంధీని కలుసుకున్నారు. నేడు(శనివారం) కాంచీపురంలో మిగతా 7లో...



## కొత్తగా 24 పార్లమెంటరీ కమిటీల ఏర్పాటు

కమిటీలో ప్రతిపక్ష నేత రాహుల్

కమ్యూనికేషన్ల కమిటీలో కంగన, మహువా

కొత్తగా పార్లమెంటరీ స్థాయీ సంఘాలు

పలువురు తెలుగు ఎంపీలకు కమిటీల్లో చోటు

విదేశాంగ వ్యవహారాలు- డీకే అరుణ, లక్ష్మణ్, ఒవైసీ

రసాయనాలు-ఈటల, ఆరోగ్యం- కడియం కావ్య

గృహ, పట్టణ కమిటీ చైర్మన్‌గా మాగుంట శ్రీనివాసులురెడ్డి

రైల్వే సారథిగా సీఎం రమేశ్

7




## కర్ణాటక సీఎంపై లోకాయుక్తలో కేసు

ఏ1గా ముఖ్యమంత్రి, ఏ2గా ఆయన భార్య పార్వతి, ఏ3గా బావమరిది

ట్రస్టు పేరిట భూ కుంభకోణం.. ఖర్గే కుటుంబంపైన ఫిర్యాదు

7

### నేడు ఆయన.. రేపు ఎవరో!



సీఎం ఎవరైనా పార్టీనే ముఖ్యం

సిద్దరామయ్య భవితవ్యంపై ఖర్గే నర్మగర్భ వ్యాఖ్యలు

# పర్యాటకానికీ పరిశ్రమ హోదా

పర్యాటకం - శాంతి నినాదంతో ప్రత్యేక పాలసీ

ఈ సెక్టారుకూ రాయితీలు, ప్రోత్సాహకాలు

హోటల్లకు రాత్రి 12 గంటల వరకు అనుమతులు

సంఘ విద్రోహ కార్యకలాపాలు చేస్తే అదే చివరి రోజు

రాష్ట్రంలో నాలుగు ఐకానిక్ పర్యాటక ప్రాజెక్టుల అభివృద్ధి

ప్రపంచ పర్యాటక దినోత్సవంలో సీఎం చంద్రబాబు






**విజయవాడ, సెప్టెంబరు 27 (మనం న్యూస్):** 'పర్యాటక రంగాన్ని కూడా పరిశ్రమగా గుర్తించి పారిశ్రామిక హోదా కల్పిస్తాం. పారిశ్రామిక రంగానికి ఇచ్చే ప్రోత్సాహకాలు, రాయితీలు పర్యాటక రంగానికీ వర్తింప చేస్తాం' అని సీఎం చంద్రబాబు అన్నారు. నగరంలోని తుమ్మలపల్లి కళా క్షేత్రంలో శుక్రవారం రాత్రి పర్యాటక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిం చారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సీఎం చంద్రబాబు మాట్లాడారు. ''పర్యాటక రంగంలో హోటళ్లు, ట్రావెల్ ఏజెన్సీలతో పాటు ఈ రంగం పరిధిలోకి వచ్చే ప్రతి ఒక్కదానికీ ఇక మీదట పరిశ్రమ హోదా వర్తిస్తుంది. ఇందుకోసం త్వరలో ఒక పాలసీని తీసుకొస్తాం. పర్యాటక రంగంలో ప్రధాన పాత్ర పోషిస్తున్న హోటళ్లకు రాత్రి 12గంటల వరకు వ్యాపార కార్యకలాపాలు నిర్వహించుకునే అవకాశాన్ని కల్పిస్తాం. పోలీసుల నుంచి ఎలాంటి ఒత్తిళ్లు, బెదిరింపులు, దాడులు ఉండవు. ప్రభుత్వం ఇచ్చే అవకాశాలను మంచిగా ఉపయోగించుకోవాలి. గంజాయి, డ్రగ్స్, అసాంఘిక శక్తులు పెచ్చుమీరితే మాత్రం అదే చివరి రోజు అవుతుందని గుర్తు పెటుట్టకోవాలి.. రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని ముందుకు తీసుకెళ్లడానికి నాలుగు ఐకానిక్ ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టాం. శ్రీశైలం, అఖండ గోదావరి, మహా సంగమేశ్వరం, సూర్యలంక ప్రాంతాలను ఐకానిక్ పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేస్తాం. పర్యాటక రంగం 20 శాతం ఉద్యోగాలు కల్పించాలి. విదేశీ యాత్రికులను ఆకట్టుకోవటంలో దేశంలో మూడో స్థానంలో నిలవాలి. దేశ జీడీపీలో పర్యాటక - మిగతా 2లో...



## వెళ్లొద్దని మేం చెప్పామా?

సాకులు వెతుక్కుని జగనే తిరుమల వెళ్లకపోతే మేమేం చేస్తాం

డిక్లరేషన్ ఇవ్వడం ఇష్టం లేకే మానేశారు

నాడు ఇవ్వలేదు కాబట్టి నేడు ఇవ్వననడం పద్ధతా?

సంప్రదాయాలను ఎవరైనా పాటించాల్సిందే పాటించనంటూ రౌడీయిజం చేస్తారా?

నెయ్యిలో కల్తీ నిజమని ల్యాబ్ తేల్చింది దానిని మేం బయటపెట్టకుండా..

వేరే విధంగా బయటకు వస్తే పరిస్థితేంటి?

దేవుడు మమ్మల్ని క్షమిస్తాడా: సీఎం చంద్రబాబు

2

## 'కుంకీ'లు వచ్చేస్తున్నాయ్!

దసరా తర్వాత ఏపీకి 4 కుంకీ ఏనుగులు

ఏపీ-కర్ణాటక మధ్య కుదిరిన ఒప్పందం

వీటి రాకతో ఏనుగుల సమస్యకు పరిష్కారం

ఎంవోయూ సందర్భంగా డిప్యూటీ సీఎం పవన్



**అమరావతి, సెప్టెంబరు 27 (మనం న్యూస్) :** రాష్ట్ర సరిహద్దు జిల్లాల్లో కొన్నేళ్లుగా వేధిస్తున్న ఏనుగుల సమస్యకు పరిష్కారం దిశగా కీలక ముందడుగు పడింది. పంట పొలాలను ధ్వంసం చేయడమే కాకుండా గ్రామాల్లోకొచ్చి విధ్వంసం సృష్టిస్తున్న మదపుటేనుగుల ఆట కట్టించే కుంకీ ఏనుగులను పంపే విషయంలో ఆంధ్రప్రదేశ్-కర్ణాటక మధ్య శుక్రవారం అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదిరింది. అలాగే అడవుల పరిరక్షణ, వన్య ప్రాణుల సంరక్షణ, గిరిజనులకు శిక్షణ, సమాచార మార్పిడి, ఏనుగుల సమస్యపై అధ్యయనం, ఎకో టూరిజం వంటి కీలక అంశాలపైనా ఇరు రాష్ట్రాలు ఎంవోయూ చేసుకున్నాయి. ఈ ఒప్పందంలో భాగంగా దసరా - మిగతా 2లో...

## నా మతం సమానత్వం

### డిక్లరేషన్‌లో రాసుకోండి : మాజీ సీఎం



ఆలయానికి వెళుతుంటే అడ్డుకోవడం దుర్మార్గం

హిందూ ధర్మాన్ని రాజకీయాలకు వాడుకోవడం సరికాదు

లడ్డూ వివాదాన్ని తప్పుదోవ పట్టించే యత్నంలో డిక్లరేషన్

మాజీ సీఎంకే ఇంతటి అవమానం జరిగితే సామాన్యుల గతేంటి

తిరుమల పర్యటన రద్దు చేసుకున్న జగన్.. మీడియాతో సమావేశం

వివరాలు 2లో..

## తిరుమల రాకుండా అడ్డుకోలేరు



జగన్‌ను డిక్లరేషన్ కోరే హక్కు టిటిడికి లేదు

గతంలో లేని డిక్లరేషన్ ఇప్పుడే ఎందుకు ?

జగన్ డిక్లరేషన్ ఇవ్వాల్సిన అసవరం లేదు

టిటిడి మాజీ ఛైర్మన్ భూమన మండిపాటు

**తిరుపతి, సెప్టెంబర్ 27 (మనం న్యూస్):** జగన్‌ను అడ్డుకునే హక్కు ఎవరికీ లేదని టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి అన్నారు. డిక్లరేషన్ అడిగితే ఈ ప్రభుత్వ పతనం ఖాయమని హెచ్చరించారు. జగన్ డిక్లరేషన్ ఇవ్వకపోతే దర్శనానికి అనుమతి లేదనే హక్కు - మిగతా 2లో...




## తిరుమలను అపవిత్రం చేసిన ఘనత జగన్‌దే

అన్యమతస్థులకు తిరుమల ప్రవేశం కల్పించారు

బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పురందేశ్వరి



**విజయవాడ, సెప్టెంబర్ 27 (మనం న్యూస్):** తిరుమల లడ్డూ ప్రసాదాన్ని కూడా వైసీపీ ప్రభుత్వం కల్తీ చేసిందని బీజేపీ ఏపీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధేశ్వరి అన్నారు. అన్యమతస్తులను టీటీడీలోకి తీసుకోవద్దని చెప్పినా కూడా ఆనాడు మాజీ సీఎం జగన్ తమ మాట వినలేదని అన్నారు. తిరుమల గురించి లక్షలాది మంది సంతకాల సేకరణ చేసి ఇచ్చినా జగన్ ఎందుకు పట్టించుకోలేదని - మిగతా 2లో...

## రాష్ట్రంలో మత రాజకీయాలు

తిరుమల లడ్డూ వ్యవహారంలో విచారణ జరగాలి

సుప్రీం ప్రధాన న్యాయమూర్తికి లేఖ రాశా

తిరుమలలో డిక్లరేషన్ రూల్ అందరికీ వర్తిస్తుంది

మీడియా సమావేశంలో వైఎస్ షర్మిల



**విజయవాడ, సెప్టెంబర్ 27 (మనం న్యూస్):** జగన్ హయాంలోనే తిరుమల లడ్డూ కల్తీ జరిగిందని ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల విమర్శించారు. లడ్డూలకు వినియోగించే నెయ్యిలో జంతువుల కొవ్వు ఉన్నట్లు ల్యాబ్‌లో నిర్ధరణ అయిందని చెప్పారు. ఈ ఘటనకు సంబంధించిన నిజానిజాలు ప్రజలకు తెలియాలని డిమాండ్ చేశారు. మళ్లీ తప్పు జరగకుండా ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఈ అంశంపై పీసీసీ అధ్యక్షురాలిగా సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తికి తాను లేఖ రాసినట్లు తెలిపారు. లడ్డూ కల్తీ ఘటనను సుమోటోగా తీసుకుని - మిగతా 2లో...

## సచివాలయాల్లో రిజిస్ట్రేషన్లు నిలిపివేత

జగన్ హయాం నాటి వివాదాస్పద నిర్ణయం రద్దు

నాడు సచివాలయాలకు జాయింట్ సబ్ రిజిస్ట్రార్ హోదా

వివరాలు 2లో..

మనం



## 'కుంకీ'లు వచ్చేస్తున్నాయ్!

మొదటి పేజీతరువాయి...

తర్వాత 4 కుంకీ ఏనుగులను కర్ణాటక ప్రభుత్వం ఏపీకి పంపనుంది. ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, కర్ణాటక పర్యాటక శాఖ మంత్రి ఈశ్వర్ ఖండ్రే సమక్షంలో అధికారులు ఈ ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ... ''కర్ణాటక ప్రభుత్వం అడవుల పరిరక్షణకు ఎంతో ప్రాధాన్యతనిస్తోంది. అడవుల్లో ఒక చెట్టు కూలినా శాటిలైట్ ద్వారా కనుగొనే పరిజ్ఞానం వారి వద్ద ఉంది. ఈ సాంకేతికతను ఏపీకి కూడా తీసుకొస్తున్నాం. చిత్తూరుతో పాటు మన్యం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో ఏనుగుల సమస్య అధికంగా ఉంది. మదపుటేనుగులు గ్రామాలపై పడకుండా అడ్డుకునేందుకు శిక్షణ పొందిన కుంకీ ఏనుగులు పనికొస్తాయి.

ఈ విషయాన్ని సీఎం చంద్రబాబుకి వివరించగా.. ఆయన సూచన మేరకు కర్ణాటక ప్రభుత్వంతో చర్చించాం. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, అటవీశాఖ మంత్రి ఈశ్వర్ ఖండ్రే దృష్టికి తీసుకెళ్లాం. వారు కుంకీ ఏనుగులను మన రాష్ట్రానికి పంపించేందుకు అంగీకరించారు' అని చెప్పారు. మైసూర్లో జరిగే దసరా ఉత్సవాల్లో కుంకీ ఏనుగులు కీలక పాత్ర పోషిస్తాయని, అందువల్ల దసరా తర్వాతే వాటిని ఇచ్చేందుకు కర్ణాటక ప్రభుత్వం అంగీకరించిందని వివరించారు. ఎర్రచందనం, శ్రీగంధం స్మగ్లింగ్ను అడ్డుకోవడంపైనా ఇరు రాష్ట్రాలు సమన్వయంతో పనిచేస్తాయని తెలిపారు. స్మగ్లర్లు అక్రమ రవాణాకు సరిహద్దుల్ని వాడుకుంటున్నారని, అందుకే జాయింట్ టాస్క్ఫోర్స్ను ఏర్పాటు చేసి స్మగ్లింగ్ను అడ్డుకుంటామని పేర్కొన్నారు. కర్ణాటకలో ఏకో టూరిజం ద్వారా అధిక సంఖ్యలో ఉద్యోగాలు కల్పిస్తున్నారని, సీఎం చంద్రబాబు సూచన మేరకు ఏకో టూరిజం పనితీరుని పరిశీలించి మన రాష్ట్రంలోనూ దాన్ని అమలు చేస్తామని చెప్పారు. కాగా, ఏపీ, కర్ణాటక మధ్య కుదిరిన కీలక ఒప్పందంలో ఆరు ప్రధానాంశాలపై దృష్టి సారించనున్నామని కర్ణాటక మంత్రి ఈశ్వర్ ఖండ్రే చెప్పారు. 'ఈ ఒప్పందంలో ఆరు ప్రధానాంశాల పట్ల దృష్టి సారించనున్నాం. సమాచార మార్పిడి, వన్యప్రాణులు సంరక్షణ, ఏనుగుల సమస్యకు పరిష్కారం, గిరిజనుల జీవన శైలి మెరుగుపర్చేలా శిక్షణ వంటి కీలకాంశాలు ఇందులో ఉంటాయి. కుంకీ ఏనుగులతో మదపుటేనుగుల సమస్యను కర్ణాటక పరిష్కరించుకోగలిగింది. ఏపీకి కూడా కుంకీలను అందించి సమస్య పరిష్కరించే ఏర్పాటు చేస్తాం' అని ఖండ్రే తెలిపారు.

## సచివాలయాల్లో రిజిస్ట్రేషన్లు నిలిపివేత

**అమరావతి, సెప్టెంబరు 27 (మనం న్యూస్):** గ్రామ,వార్డు సచివాలయాల్లో రిజిస్ట్రేషన్లను రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసింది. ప్రజల ఆస్తులకు భద్రత లేకుండా చేసిన గత ప్రభుత్వ నిర్ణయాన్ని ఈ ఏడాది ఆగస్టులోనే పక్కనపెట్టిన చంద్రబాబు ప్రభుత్వం, ఈ మేరకు శుక్రవారం జీవో విడుదల చేసింది. రిజిస్ట్రేషన్ చట్టంలోని సెక్షన్ 7 ప్రకారం గ్రామ, వార్డు సచివాలయాలకు గత ప్రభుత్వం జాయింట్ సబ్రిజిస్ట్రార్ కార్యాలయాల హోదా కల్పించింది. పేదలకు ఇళ్ల స్థలాల పథకం కింద వారికిచ్చే సెంటు భూమిని రిజిస్ట్రేషన్ చేసేందుకు గ్రామ, వార్డు సచివాలయాలను ఉపయోగించుకోవాలని ఆదేశించారు. కానీ, ఇళ్ల రిజిస్ట్రేషన్ పత్రాలపై జగన్ బొమ్మ ఉండడంతో పేదలకిచ్చిన ఆ పత్రాలు చెల్లుబాటు కాకుండా పోయాయి. దానికితోడు పంచాయతీ సెక్రటరీలపై రాజకీయ ఒత్తిళ్లు పెరిగాయి. ఫలితంగా చాలాచోట్ల సరైన భూములు కూడా వివాదాస్పదమయ్యాయి. దీనిపై వైసీపీ హయాంలోనే అనేక ఫిర్యాదులు అందాయి. అయినప్పటికీ గత ప్రభుత్వం దిద్దుబాటు చర్యలు తీసుకోలేదు. పైగా పంచాయతీ సెక్రటరీలకు సబ్రిజిస్ట్రార్ల శిక్షణ ఇచ్చి, జాయింట్ సబ్రిజిస్ట్రార్ హోదా కల్పించింది. తాము ఇప్పటికే పంచాయతీ పనులతోనే ఊపిరి సలపకుండా ఉన్నామని, కొత్తగా భారం పెంచవద్దు అని వారు గోడు వెళ్లబోసుకున్నా జగన్ ప్రభుత్వం లెక్కచేయలేదు. ఈ విధానం వల్ల అనవసర వివాదాలు తలెత్తుతుండడంతో కొత్తగా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం... గ్రామ, వార్డు సచివాలయాల్లో రిజిస్ట్రేషన్లు నిలిపివేస్తూ ఆగస్టులోనే నోటిఫికేషన్ ఇచ్చింది. ఈ నోటిఫికేషన్ తక్షణమే అమల్లోకి వస్తుందంటూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది.

# పర్యాటకానికీ పరిశ్రమ హోదా

మొదటి పేజీతరువాయి...

రంగం ద్వారా 6.5 శాతం ఆదాయం వస్తోందని, మన రాష్ట్రంలో 7.61 శాతం ఆదాయం వస్తోంది. దేశీయ పర్యాటకుల సందర్శనలో ఏపీ మూడో స్థానంలో ఉంది. విదేశీయుల సందర్శనలో 16వ స్థానంలో ఉంది. పర్యాటకానికి సంబంధించి మన రాష్ట్రంలో ఎన్నో వనరులు ఉన్నా.. మార్కెటింగ్ చేయలేకపోతున్నాం. రాష్ట్రంలో 974 కిలోమీటర్ల తీర ప్రాంతం ఉంది. నదులు, చరిత్ర, సంస్కృతి, పర్యావరణానికి అనేక ప్రత్యేకతలు, ప్రాచీన ఆలయాలు, బౌద్ధ ఆరామాలు, ఆధ్యాత్మిక కేంద్రాలు, 13 వన్య ప్రాణుల అభయారణ్యాలు, 3 జాతీయ పార్కులు, 400 సంవత్సరాల చరిత్ర కలిగిన హస్తకళలైన కొండపల్లి బొమ్మలు, కలంకారీ, లేపాక్షి వంటివి ఉన్నాయి. రాష్ట్రంలో పేరుమోసిన పుణ్య క్షేత్రాలు ఉన్నాయి. బీచ్ టూరిజం, హెలీ టూరిజం, వాటర్ స్పోర్ట్స్ అభివృద్ధి చేసుకోగలిగిన వనరులు ఉన్నాయి. అరకు, లంబసింగి, కోనసీమ వంటి అద్భుతమైన ప్రాంతాలు ఉన్నాయి. రాష్ట్రంలో 206 స్వచ్ఛమైన బీచ్లు ఉన్నాయి. వీటిని అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉంది. విశాఖలో రుషికొండకు బ్లూ ఫ్లాగ్ వచ్చిందని, సూర్యలంక, కాకినాడ, మచిలీపట్నం బ్లూ ఫ్లాగ్ సర్టిఫికెట్ కోసం ప్రయత్నం చేస్తున్నాం. పర్యాటకం-శాంతి అనే నినాదంతో వెళ్తాం. 'ఏ ఇజంలు లేవు. వ్యవసాయం తర్వాత ఎక్కువ ఉపాధి అవకాశాలను కల్పించే రంగం పర్యాటకరంగమే. నైపుణ్యత కల్పిస్తే పర్యాటక రంగంలో మూడు రెట్ల ఆదాయం పెరుగుతుంది'' అని అన్నారు.

### తిరుమల వెళ్లే అన్యమతస్థులు డిక్లరేషన్ ఇవ్వాల్సిందే..

'ప్రతి ఆలయానికి, ప్రతి మతానికి కొన్ని సంప్రదాయాలు ఉంటాయి. దేవాలయాలు, చర్చిలు, మసీదుల్లో ఉండే సంప్రదాయాలను గౌరవించటం కూడా ముఖ్యం. అన్య మతస్థులు తిరుమల వెళ్తే డిక్లరేషన్ ఇవ్వాలి. అది ఇవ్వకుండా వెళ్తే తప్పు, చట్టవిరుద్ధం.




భవిష్యత్తులో ఏ దేవాలయాల్లో కూడా అపచారాలు లేకుండా చూసే బాధ్యత తీసుకుంటా' అని చంద్రబాబు అన్నారు.

### పర్యాటకాభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపనలు

ప్రపంచ పర్యాటక దినోత్సవం రోజున ముఖ్యమంత్రి చంద్రబాబు పలు పర్యాటక ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. కర్నూలు జిల్లా ఆదోనిలో రూ.100 కోట్లతో విమల రీజెన్సీ స్టార్ హోటల్కు సీఎం చంద్రబాబు శంకుస్థాపన చేశారు. రూ.6 కోట్లతో తిరుపతి జిల్లాలో చంద్రగిరి కోటలో సౌండ్ అండ్ లైట్ షో ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. రూ.7.32 కోట్లతో అనకాపల్లి జిల్లాలో చేపట్టే సౌండ్ అండ్ లైట్ షో ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. ఏపీటీడీసీ, ఐఆర్సీటీసీల మధ్య సంయుక్త పర్యాటక విధానాలపై ముఖ్యమంత్రి సమక్షంలో ఒప్పందం జరిగింది.

# నా మతం సమానత్వం..

**అమరావతి, సెప్టెంబర్ 27 (మనం న్యూస్):** నా మతమేమిటని అందరూ అడుగుతున్నారని..నా మతం మానవత్వ మని కావాలంటే డిక్లరేషన్లో రాసుకోవాలని జగన్ సవాల్ చేశారు. దేవుడి దగ్గరకు వెళ్తాంటే ఏ మతం అని అడుగుతారా అని ప్రశనించారు. తిరుమల పర్యటనను రద్దు చేసుకున్న తర్వాత జగన్ మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా డిక్లరేషన్ అంశంపై స్పందించారు. తాను నాలుగు గోడుల మధ్య బైబిల్ చదువుతానని ప్రకటించారు. అందులో తప్పేముందన్నారు. బయటకు వెళ్తే హిందూ సంప్రదాయాలను అనుసరిస్తానని చెప్పారు. అలాగే ఇస్లాంనూ గౌరవిస్తానని.. సిక్కిజంను కూడా ఆచరిస్తానని చెప్పుకొచ్చారు. తన మతం మానవత్వమేనన్నారు. గతంలో తాను పదిహేను సార్లకుపైగా తిరుమల కొండపైకి వెళ్లి వచ్చానన్నారు. మాజీ ముఖ్యమంత్రికే ఈ పరిస్థితి వస్తే దళితుల పరిస్థితి ఏమిటని జగన్ ప్రశ్నించారు. హిందూ ధర్మాన్ని రాజకీయాలకు వాడుకోవడం కరెక్ట్ కాదన్నారు. తనను అడ్డుకోవడానికి ఇతర రాష్ట్రాల నుంచి బీజేపీ నేతల్ని కూడా తీసుకు వచ్చారని ఆరోపించారు. పాదయాత్ర చేసిన తర్వాత నడుచుకుంటూ తిరుమలకు వెళ్లాలని.. ముఖ్యమంత్రిగా ఉంటూ పట్టు వస్త్రాలు సమర్పించానని జగన్ తెలిపారు. అలాంటి తనను అడ్డుకోవాలనుకోవడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. గుడికి వెళ్లే వ్యక్తిని ఏ మతం అని అడుగుతారా అని జగన్ ఆవేదన వ్యక్తం చేశారు. తిరుమలలో అన్యమతస్తులు శ్రీవారి దర్శనానికి వస్తే.. తమకు దేవదేవునిపై నమ్మకం ఉందని డిక్లరేషన్ ఇవ్వడం చాలా కాలంగా సంప్రదాయంగా ఉంది. గతంలో సోనియా గాంధీ, అబ్దుల్ కలాం కూడా డిక్లరేషన్లు ఇచ్చారు. అయితే ఆ తర్వాత రాజకీయ నేతలు మత పరమైన అంశాల్లో ఇలాంటి డిక్లరేషన్లు ఇవ్వడానికి సిద్ధపడటం లేదు. ఇప్పుడు జగన్మోహన్ రెడ్డి కూడా అలాంటి డిక్లరేషన్ అడుగుతున్న కారణమంగానే తిరుమలకు వెళ్లుండా ఆగిపోయినట్లుగా తెలుస్తోంది. డిక్లరేషన్ విషయంలో ఆయన చేసిన వాదనను బట్టి ఈ విషయం అర్థం చేసుకోవచ్చని అంచనా వేస్తున్నారు. కూటమిలోఉన్న బీజేపీని కూడా ప్రశ్నిస్తున్నానని.. మత రాజకీయాలు చేయడం ఏమిటని మండిపడ్డారు. తిరుమల లడ్డూకు తయారు చేసిన నెయ్యిలో జంతువుల కొవ్వు కలిసిందని అబద్దాలు ప్రచారం చేస్తున్నారని జగన్ మరోసారి స్పష్టం చేశారు. కల్తీ జరగకపోయినా జరిగిందని ప్రచారం చేసి చంద్రాబాబే శ్రీవారి ఆలయ ప్రతిష్టను దెబ్బతీశారని.. మళ్లీ ఆయనే సిట్ వేశారని మండిపడ్డారు. మొత్తంగా జగన్ తిరుమల పర్యటన రద్దునకు.. డిక్లరేషనే ప్రధాన కారణంగా భావిస్తున్నారు. దైవ దర్శనానికి వెళ్తామంటే అడ్డుకునే ప్రయత్నం చేయడం దేశంలో ఎప్పుడూ జరిగి ఉండదని అని జగన్ అన్నారు. జగన్ తిరుమల పర్యటనకు అనుమతి లేదని మా పార్టీ నేతలకు పోలీసులు నోటీసులు ఇస్తున్నారు. ఇలాంటి పరిస్థితులు గతంలో ఎప్పుడూ చూడలేదు. లడ్డూల అంశాన్ని పక్కదారి పట్టించేందుకు డిక్లరేషన్ అంశాన్ని తీసుకొచ్చారు. తిరుమల లడ్డూపై చెప్పినవన్నీ అబద్దాలని రుజువులు కనిపిస్తున్నాయి. సీఎం స్థానంలో ఉన్న వ్యక్తి అసత్యాలు చెబుతున్నారు. తిరుమల పవిత్రతను, శ్రీవారి ప్రసాదాన్ని రాజకీయం చేస్తున్నారని జగన్ ఆరోపించారు. తితిదేలో 6 నెలలకు ఒకసారి టెండర్లు పిలవడం దశాబ్దాలుగా జరుగుతున్నదే. తక్కువ రేటుకు కోట్ చేసిన వారికి తితిదే టెండర్ ఖరారు చేస్తుంది. దశాబ్దాలుగా జరుగుతున్న కార్యక్రమాన్ని వివాదాస్పదం చేస్తున్నారు. క్వాలిటీ చెక్ చేయించాకే వాహనాలు వస్తాయి. తితిదే కూడా క్వాలిటీ చెక్ చేస్తోంది. పరీక్షలో విఫలమైన వాహనాలను వెనక్కి పంపడం సాధారణం. గతంలో తెదేపా హయాంలో కూడా కొన్ని ట్యాంకర్లను వెనక్కి పంపించారు. కల్తీ ప్రసాదాలను భక్తులు తిన్నట్టుగా దుష్ప్రచారం చేస్తున్నారు. తితిదే బోర్డు సభ్యులుగా తీసుకోవాలని కేంద్రం, సీఎంలు సిఫారసు చేస్తారు. తితిదే బోర్డు సభ్యులు ప్రముఖులు.. పారదర్శకంగా పనిచేస్తారని జగన్ అన్నారు. తప్పు చేసేందుకు అవకాశం లేని వ్యవస్థలో తితిదేలో ఉంది. మా హయాంలోనూ 18 సార్లు నెయ్యి ట్యాంకర్లను వెనక్కి పంపాం. శ్రీవారి ప్రసాదాల్లో వాడని నెయ్యిని వాడినట్లు ఎందుకు అంటున్నారు. అప్పుడప్పుడు నమూనాలను సీఎఫ్టీఆర్ఐ మైసూర్కు పంపిస్తారు. ఇప్పుడు నమూనాల పరీక్షకు మొదటిసారిగా గుజరాత్కు పంపారు. ఆవులు వెజిటబుల్స్ ఆయిల్స్ తిన్నా ఇలాంటి ఫలితాలు వస్తాయని చెప్పింది. ఈ విషయాలన్నీ నివేదిక డిస్క్లయిమర్స్లో రాశారు. గుజరాత్ నుంచి వచ్చిన నివేదికను తెదేపా కార్యాలయం రిలీజ్ చేసింది. రహస్య నివేదిక అయితే తెదేపా ఆఫీసు నుంచి ఎలా బయటకు వస్తుంది? ట్యాంకర్లలో వచ్చిన నెయ్యిని వాడలేదని తితిదే ఈవో చెప్పారు. సెప్టెంబరు 22న తితిదే ఈవో ప్రభుత్వానికి లేఖ పంపారు. తితిదే ఈవో పలుమార్లు చెప్పినా వినకుండా సీఎం మళ్లీ అబద్దాలు చెప్పారు. రాజకీయంగా లబ్ది పొందేందుకే ఇలా అబద్దాలు ఆడుతున్నారు. తిరుమల ప్రసాదాలపై ఇలా దుష్ప్రచారం చేయడం అపవిత్రత కాదా అని ప్రశ్నించారు. గతంలో అనేకసార్లు తిరుమల వెళ్లా.. ఈ విషయం అందరికీ తెలుసు. శ్రీవారి దర్శనం చేసుకున్నాకే నా పాదయాత్ర ప్రారంభించా. పాదయాత్ర పూర్తయ్యాక కూడా నడిచివెళ్లి స్వామివారిని దర్శించుకున్నా. బ్రహ్మోత్సవాల్లో స్వామి వారికి ఐదు సార్లు వస్త్రాలు సమర్పించా. నా కులం, మతం గురించి ప్రజలందరికీ తెలుసు. గుడికి వెళ్లే వ్యక్తిని ఏ మతం అని అడగడం సరికాదు. మాజీ సీఎంకే ఇలాంటి పరిస్థితి ఉంటే మిగతావారి పరిస్థితి ఏంటి? మతం పేరుతో రాజకీయాలు చేయడం చాలా దౌర్భాగ్యం అని జగన్ ఆరోపించారు.

# తిరుమల రాకుండా అడ్డుకోలేరు

మొదటి పేజీతరువాయి...

టీటీడీకి లేదని స్పష్టం చేశారు. ఎవరైనా శ్రీవారిని దర్శించుకోవచ్చని సనాతన ధర్మం చెబుతోందని తెలిపారు. అలాంటిది ఐదేళ్లు ముఖ్యమంత్రిగా పట్టు వస్త్రాలు సమర్పించిన జగన్ను డిక్లరేషన్ అడగడం దారుణమని విమర్శించారు. జగన్ డిక్లరేషన్పై ఇంత రాద్ధాంతం జరిగినా చంద్రబాబు మాట్లాడటం లేదని భూమన కరుణాకర్ రెడ్డి విమర్శించారు. డిక్లరేషన్ వెనుక రాజకీయ కుట్ర ఉందని తెలిపారు. ప్రభుత్వం ఎంత నిర్బంధిస్తే అంత పైకి లేస్తామని హెచ్చరిం చారు. చంద్రబాబు పాశవిక విధానాలను వ్యతిరేకిస్తూనే ఉంటామని భూమన తెలిపారు. చంద్రబాబు వెయ్యి నాలుకల ధోరణిని ఇకనైనా మానుకోవాలని హితవు పలికారు. వైఎస్ జగన్ తిరుమల పర్యటన ఆసక్తి రేపుతోన్న వేళ.. టీటీడీ మాజీ ఛైర్మన్, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేత భూమన కరుణాకర్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు.. అసలు వైఎస్ జగన్ ను డిక్లరేషన్ అడిగే హక్కు టీటీడీకి లేదన్నారు. ఐదుసార్లు స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించిన వ్యక్తిని ఎలా అడిగుతారు డిక్లరేషన్ అని నిలదీశారు.. టీటీడీ డిక్లరేషన్ అడిగితే ఈ ప్రభుత్వం పతనం ప్రారంభం అయినట్లే అవుతుందన్నారు.. ఇక, సోనియా గాంధీ డిక్లరేషన్ పెట్టలేదు.. దానికి సాక్షం నేనే అన్నారు.. తిరుమలకు నడిచివెళ్లే అడిగే అధికారం కూడా టీటీడీకి లేదన్నారు.. కానీ, వైఎస్ జగన్ కాలినడకన తిరుమల వెళ్తారని ఎక్కడా చెప్పలేదని స్పష్టం చేశారు.. ఒక భక్తుడిగా వెంకన్న క్షేత్రానికి జగన్ వస్తున్నారు.. దర్శనానికి వస్తుంటే అడుగు అడుగునా ఆటంకం సృష్టిస్తున్నారు.. చంద్రబాబు చెప్పినట్లు పోలీసులు మాజీ ఎమ్మెల్యేలు, మంత్రులను హౌస్ అరెస్ట్ చేశారు.. నగర వైసీపీ నేతలను, కార్యకర్తలు బెదిరిస్తున్నారు.. భయభ్రాంతులకు గురి చేస్తూ నోటీసులు ఇచ్చారు.. అసలు జగన్ అంటే ఎందుకు చంద్రబాబుకు భయం అని ప్రశ్నించారు.. భగవంతుని పట్ల అంతంతమాత్రమే నమ్మకం ఉన్న సూడో మనుషులు.. జగన్ డిక్లరేషన్ ఇవ్వాలని చేబుతున్నారని భూమన దుయ్యబట్టారు.. హిందూ ధర్మానికి విరుద్ధంగా కూటమి నేతలు వ్యవహరిస్తున్నారు. ఐదు సార్లు సీఎం హోదాలో స్వామివారికి పట్టు వస్త్రాలు జగన్ సమర్పించారని గుర్తుచేశారు.. లడ్డూ ఘటనలో డిఫెన్స్లో పడిపోయి ఇలాంటి పనులు చేస్తున్నారని మండిపడ్డారు.. పూజలు కూడా చేయకుండా ఇంటిలోనే ఉండాలని వైసీపీ నేతలను అడ్డుకుంటున్నారు. వైసీపీ నేతలు పూజలు కూడా చేయకూడదా? ఎందుకు మీకు అంతా భయం..? అని నిలదీశారు.. 40 శాతం ఓట్లు సాధించిన జగన్ వెంటా ఎవరు లేరని చెప్పడానికి కూటమి నేతలు ప్రయత్నిస్తున్నారని ఎద్దేవా చేశారు.. అది జరగని పని.. వ్యక్తిగత రాజకీయాల్లోకి దేవుడిని తీసుకుని రాకండి. చంద్రబాబు ఒకటి చేబితే.. పవన్ కల్యాణ్ మరొకటి చెబుతాడు.. హైందవ ధర్మాన్ని పవన్ ఒక్కడే కాపాడేవాడిలా మాట్లాడుతున్నాడు అంటూ ఎద్దేవా చేశారు..వైఎస్ జగన్ తిరుమల వస్తుంటే ఇప్పుడు పవన్ కల్యాణ్ సన్నాయి నొక్కలు నోక్కుతున్నాడు.. మేమే హిందువులు అన్నట్లుగా బీజేపీ నేతలు మాట్లాడుతు న్నారని భూమన అన్నారు. సనాతన ధర్మం పై మాకు విశ్వాసం ఉంది? చంద్రబాబు స్వయంగా జగన్ రావాలని ఆహ్వానం పంపాలి. జగన్ ను అడ్డుకుంటే సనాతన ధర్మాన్ని వ్యతిరేకించినట్లే.. దీని వెనుక రాజకీయ కుట్ర ఉందన్నారు.. ప్రభుత్వం ఎన్ని అడ్డంకులు సృష్టించిన జగన్ స్వామివారిని దర్శనం చేసుకునే వెళ్తారని స్పష్టం చేశారు.. చంద్రబాబు సైలెంట్ గా ఉండి మిత్ర పక్షాలను, పోలీసులను రెచ్చగొడుతున్నారు. నిన్నటి వరకు లడ్డూతో డైవర్షన్ పాలిటిక్స్ చేశారు.. లడ్డూలో పస తగ్గడంతో ఇప్పుడు డిక్లరేషన్ అంటూ మొదలెట్టారు అంటూ భూమన కరుణాకర్రెడ్డి మండిపడ్డారు..

# వెళ్లొద్దని మేం చెప్పామా?

**అమరావతి, సెప్టెంబరు 27 (మనం న్యూస్):** తిరుమల వెళ్లవద్దని మాజీ సీఎం జగన్కు తామెవరం చెప్పలేదని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఆయనే సాకులు వెతుక్కుని వెళ్లకపోతే తామేం చేస్తామని ప్రశ్నించారు. తాను ఆగిపోయి ఆ నెపం మరొకరి మీద వేయాలని చూస్తే మౌనంగా వింటూ ఉండలేమని స్పష్టం చేశారు. శుక్రవారం రాత్రి రాష్ట్ర సచివాలయంలో చంద్రబాబు మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. తిరుమల పర్యటనకు సంబంధించి జగన్ చేసిన వ్యాఖ్యలపై స్పందించారు. 'స్వామిపై భక్తి ఉన్నవారు ఎవరైనా తిరుమలకు వెళ్లవచ్చు. వేరే మతాల వారు వెళ్లాలనుకుంటే అక్కడి ఆచార సంప్రదాయాలు పాటిస్తూ నిశ్చింతగా వెళ్లిరావచ్చు. జగన్ను తిరుమల పోవద్దని ఎవరూ చెప్పలేదు. ర్యాలీలు, ప్రదర్శనలు మాత్రం వద్దని చెప్పారు. ఇటీవల వెలుగులోకి వచ్చిన విషయాలతో భక్తుల మనోభావాలు దెబ్బ తిన్నాయి. ఇటువంటి సమయంలో వేల మందితో ర్యాలీలు చేస్తామని అక్కడ స్థానికంగా ఉన్న నాయకులు ప్రకటనలు ఇచ్చారు. అటువంటివి జరగకుండా స్థానికంగా పోలీసు యాక్టు 30 విధించి ర్యాలీలు, ప్రదర్శనలు చేయవద్దని ఆదేశాలిచ్చారు. జగన్కు వ్యక్తిగతంగా ఏ నోటీసూ ఇవ్వలేదు. తిరుపతిలో ఉన్న ఆయన పార్టీ నేతలకు మాత్రమే ర్యాలీలు చేయవద్దని నోటీసులిచ్చారు. ఆయనకు ఇచ్చి ఉంటే చూపించమనండి. అబద్ధాలు చెప్పి ప్రజలను మభ్యపెట్టడం సరికాదు. తిరుమల హిందువులకు పెద్ద పుణ్య క్షేత్రం. జీవితంలో ఒక్కసారైనా స్వామిని సందర్శించి మొక్కులు తీర్చుకోవాలన్నది అనేక మంది కోరిక. ఆ ఆలయంలో కొన్ని ఆచార సంప్రదాయాలు ఉన్నప్పుడు దానిని పాటించడం సందర్శించేవారు పాటించాల్సిన కనీస ధర్మం. తిరుమల పవిత్రతను అందరూ కాపాడాలి. ఆగమ పద్ధతులు, ఆలయ సంప్రదాయాలు పాటించకపోతే భక్తులు బాధపడతారు. ఇంతకు ముందు కూడా డిక్లరేషన్ ఇవ్వకుండా వెళ్లాను కాబట్టి మళ్లీ వెళ్తాననడం ఏం పద్ధతి? ఒకసారి ధిక్కరించారు కాబట్టి మళ్లీ మళ్లీ ధిక్కరిస్తారా? చట్టాలను మనమే గౌరవించకపోతే ఇక ప్రజలు ఎందుకు గౌరవించాలి? ఏ సంప్రదాయాలూ పాటించేది లేదని రౌడీయిజం చేస్తారా? జమ్మూ కశ్మీరు ముఖ్యమంత్రి కూడా ఈ ఆలయంలో డిక్లరేషన్ ఇచ్చి స్వామివారి సందర్శనకు వెళ్లారు. మరి వీళ్లకు ఏమిటి ఇబ్బంది' అని చంద్రబాబు విరుచుకుపడ్డారు.

### మతాన్ని గౌరవించినట్లే సంప్రదాయాలు గౌరవించండి..

తాను బయటకు వెళ్తే హిందూ మతాన్ని గౌరవిస్తానని జగన్ చెప్పడం సంతోషమని, కాని అదే సమయంలో మతాన్ని గౌరవించినట్లే ఆలయ ఆచార వ్యవహారాలను కూడా ఆయన గౌరవించాలని చంద్రబాబు సూచించారు. 'తాను ఇంట్లో బైబిల్ చదువుతానని జగన్ అంగీకరించారు. తానే చెప్పారు. దానిని దాచుకోవడం ఎందుకు? బహిరంగంగానే చదువుకోండి. అదేమీ తప్పు కాదు. నేను హిందువును. పూజలు చేస్తాను. చర్చికి లేదా మసీదుకు వెళ్లినప్పుడు అక్కడ ఏ సంప్రదాయం, ఆచారం ఉంటే దానిని పాటిస్తాను. మీరూ అలాగే ఉండండి. ఒక అబద్ధాన్ని పదేపదే చెబుతారు. దానిని తమ పత్రికలో, టీవీలో, బ్లూ మీడియాలో పదేపదే ప్రచారం చేస్తారు. తిరుమలకు వచ్చే నెయ్యిలో కల్తీ జరగలేదని ఈవో చెప్పారని ఒక అబద్ధాన్ని ఇదే మాదిరిగా ప్రచారం చేస్తున్నారు. కల్తీ జరిగిందని ఈవో బహిరంగంగా చెప్పినా ఆ ప్రచారం మానలేదు. కల్తీ నెయ్యి అసలు వాడనే లేదని మరో ప్రచారం చేశారు. ఏఆర్ ఫుడ్స్ అనే కంపెనీ నుంచి 8 ట్యాంకర్ల నెయ్యి వచ్చింది. అందులో నాలుగు ట్యాంకర్లు వాడారు. అనుమానం వచ్చి మరో నాలుగు ట్యాంకర్ల నెయ్యి వాడకుండా నిలిపివేసి వాటి నుంచి శాంపిల్స్ తీసి గుజరాత్లో ఎన్డీడీబీ ల్యాబ్కు పంపారు. కల్తీ జరిగిందని అందులో వచ్చింది. మేం దానిని బయటపెట్టకపోతే.. అది మరో రకంగా బయటకు వస్తే మేం తప్పు చేసినట్లు కాదా! దేవుడు మమ్మల్ని క్షమిస్తాడా? తెలిసో తెలియక జరిగిన తప్పుల నుంచి కాపాడాలని ఆగస్టులో తిరుమల ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఇటీవల మళ్లీ సంప్రోక్షణ చేశారు. ఇవన్నీ ఈవో చేయించారు. కల్తీ జరగకపోతే ఇవన్నీ ఎందుకు చేయిస్తారు? తప్పు నేను చేశానని ఎదురుదాడి చేస్తున్నారు. నెయ్యి కొనుగోలుకు ఉన్న టెండర్ నిబంధనలు ఎవరు మార్చారు? రేటు తక్కువకు వస్తోందని ఎడాపెడా కొనుగోలు చేసింది ఎవరు? అన్నప్రసాదం నాణ్యత బాగోలేదని భక్తులు ఎంతోకాలంగా ఫిర్యాదు చేస్తున్నా పట్టించుకోకుండా ఉన్నది ఎవరు? ఒక్క తిరుమలలోనే కాదు... అన్ని ఆలయాల్లో ఇలాగే చేశారని చంద్రబాబు అన్నారు.

## రాష్ట్రంలో మత రాజకీయాలు

మొదటి పేజీతరువాయి...

విచారణ జరపాలని కోరామన్నారు. మరోవైపు జగన్ తిరుమల పర్యటనలో డిక్లరేషన్ అంశంపై మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా ఆమె స్పందించారు. డిక్లరేషన్ రూల్ అందరికీ వర్తిస్తుందన్నారు. 'రూల్స్ అప్లైడ్ ఫర్ ఆల్ పీపుల్' అని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు , డిప్యూటీ సీఎం పవన్ పశ్చాత్తాప దీక్ష , మాజీ సీఎం జగన్ ప్రక్షాళన దీక్షలు చేస్తున్నారని ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల అన్నారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ... ఒకరిపై పోటీ పడి నీచమైన మత రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. జగన్ సర్కారు తిరుమల లడ్డూను కల్తీ చేసిందని ఆరోపించారు. వైసీపీ హయాంలో మార్కెట్ కంటే తక్కువకే జగన్ సర్కారు నెయ్యి కొనుగోలు చేసిందన్నారు. లడ్డూలకు వాడే నెయ్యిలో జంతు కొవ్వులు ఉన్నాయని ల్యాబ్లోనూ నిర్ధారించారని తెలిపారు. నెయ్యి కల్తీ జరిగిందనే విషయం చంద్రబాబుకు తెలుసని.. సాక్ష్యాలు, రిపోర్టులు ఉన్నా చంద్రబాబు చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. హిందూ మతంపై దాడి అని బీజేపీ మాట్లాడుతోందని... చర్చిలు, మసీదుపై దాడి జరిగితే ఇలాగే ఉంటారా అని పవన్ దుర్మార్గంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. మత విద్వేషాలు పెంచే ఆలోచన కూటమి నేతలకు ఉందా అంటూ ఏపీసీసీ చీఫ్ నిలదీశారు. మతాలను రెచ్చగొట్టడమే బీజేపీ ఉద్దేశమని వ్యాఖ్యలు చేశారు. రాజకీయ లబ్ది కోసం కావాలనే రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం భావ్యం కాదన్నారు. కేంద్ర మంత్రులు కూడా బాధ్యతా రాహిత్యంగా మాట్లాడటం సరైంది కాదన్నారు. సెంటిమెంట్ దెబ్బతీసేలా మాట్లాడుతున్నప్పటికీ ప్రధాని మోదీ కనీసం ఎందుకు స్పందించడం లేదని అడిగారు. కనీసం సీబీఐ విచారణ జరగాలని మోదీకి ఎందుకు అనిపించలేదని ప్రశ్నించారు. రెండు నెలలైనా విచారణకు ఎందుకు ఆదేశించలేదన్ని ప్రశ్నల వర్షం కురిపించారు. హిందూ మతంపై నిజంగా కుట్ర జరిగితే సీబీఐ దర్యాప్తులో తేలేది కదా అని అన్నారు. రెండు నెలల ముందే సిట్ వేసి ఉంటే రచ్చ జరిగేదే కాదు కదా అని అన్నారు. చంద్రబాబు, పవన్, జగన్ అంతా కలసి నీచరాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో మతోన్మాద చర్యలు అవసరం లేదన్నారు. తిరుమల వ్యవహారంలో సవాళ్లు, దీక్షలు, ప్రమాణాలు అవసరం లేదన్నారు. తిరుమల లడ్డూ కల్తీ ఘటన విషయమై ప్రజలకు నిజం తెలియాలన్నారు. తిరుమలలో మళ్లీ తప్పు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ వ్యవహారంపై పీసీసీ అధ్యక్షురాలిగా సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తికి లేఖ రాసినట్లు తెలిపారు. తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారంపై సుమోటోగా తీసుకుని విచారణ జరపాలని సీజేఐని కోరామన్నారు.

## తిరుమలను అపవిత్రం చేసిన ఘనత జగన్దే

మొదటి పేజీతరువాయి...

ప్రశ్నించారు. బీజేపీ సభ్యత్వ నమోదుపై రాష్ట్రస్థాయి సమావేశం శుక్రవారం జరిగింది. బీజేపీఅధ్యక్షురాలు దగ్గుబాటి పురంధేశ్వరి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో పలువురు ముఖ్య నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దగ్గుబాటి పురంధేశ్వరి మాట్లాడుతూ... ఏపీలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉచిత ఇసుక విధానాన్ని ప్రజల కోసం అమలు చేస్తోందని దగ్గుబాటి పురంధేశ్వరి తెలిపారు. నేడు ఏపీలో ఎన్డీఏ కూటమి ఆధ్వర్యంలో మంచి పాలన సాగుతుందని అన్నారు. 13 జిల్లాల్లో వైసీపీ నేతలకు నచ్చిన వారికి ఇసుక రీచ్లు కట్టబెట్టి దోపిడీ చేశారని దగ్గుబాటి పురంధేశ్వరి ఆరోపించారు. జగన్ ప్రభుత్వంలో జరిగిన అవినీతిని ప్రజల్లోకి తీసుకు వెళ్లాలని అన్నారు. బీజేపీ ప్రజల పక్షాన నిలబడుతుందని.. వారి కోసం కార్యకర్తలు, ఎన్డీఏ కూటమి నేతలు కలిసి నడవాలని పిలుపునిచ్చారు. కేంద్ర బ్జడెట్లో కూడా ఏపీ అభివృద్ధికి మోదీ ఎంతో ప్రాధాన్యత ఇచ్చారని చెప్పారు. పోలవరం నిర్మాణం కూడా పూర్తి చేసి, రైతుల కల నెరవేరుస్తామని హామీ ఇచ్చారు. విశాఖపట్నం స్టీల్ ఎలాంట్ ప్రైవేటీకరణపై కొంతమంది రాద్ధాంతం చేస్తున్నారని దగ్గుబాటి పురంధేశ్వరి మండిపడ్డారు. స్టీల్ పాంట్ను లాభాల బాటలో ఎలా నడిపించాలనే దానిపై ఇటీవల సీఎం చంద్రబాబు కూడా సమీక్ష చేశారని దగ్గుబాటి పురంధేశ్వరి గుర్తుచేశారు. ఇప్పుడు ఉన్న భాగస్వామ్యాన్ని అదే విధంగా కొనసాగిస్తూ.. లాభాల్లో నడిచేలా కార్యాచరణ రూపొందిస్తామని దగ్గుబాటి పురంధేశ్వరి స్పష్టం చేశారు. గతంలో అభివృద్ధి పుల కోసం కేంద్ర ప్రభుత్వం వైసీపీ ప్రభుత్వాన్ని భూమిని కేటాయించాలని అడిగితే నిరుపయోగమైన భూమిని ఇచ్చారని అన్నారు. కానీ నిందలు మాత్రం కేంద్ర ప్రభుత్వంపై వేసి జగన్ తప్పుకున్నారని ధ్వజమెత్తారు. ప్రైవేటీకరణ పేరుతో జగన్ ప్రభుత్వం చేసిన అసత్యాలను తిప్పి కొట్టాలని దగ్గుబాటి పురంధేశ్వరి అన్నారు. చంద్రబాబు సీఎంగా బాధ్యతలు చేపట్టిన వెంటనే భూమిని కేటాయించారని చెప్పారు. గ్రామాలు అభివృద్ధి చెందకుండా నిధులను జగన్ ప్రభుత్వం దారి మళ్లించిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 13వేల పైబడి పంచాయతీల్లో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఒకే సమయంలో గ్రామసభలు నిర్వహించారని దగ్గుబాటి పురంధేశ్వరి ప్రశంసించారు.

# 3 శాఖల జాయింట్ ఆపరేషన్..

# ఒక్క కేసైనా నమోదు చేయరేమి?

- అటవీశాఖ, మత్స్యశాఖ, పోలీస్ అధికారుల ఉరుకులు పరుగులు
- నిద్రలో ఉన్న ఇరిగేషన్ అధికారులు
- పోలవరం ప్రాజెక్టు బ్యాక్ వాటర్ గోదావరి నది గర్భంలో ఇంత జరుగుతున్నా పట్టించుకోని ఇరిగేషన్ అధికారులు
- అర్ధరాత్రి నదీ గర్భంలో అనుమతి లేని బోట్ల యొక్క కదలికలను పట్టించుకోని ఉన్నత అధికారులు





**అల్లూరి జిల్లా దేవీపట్నం,సెప్టెంబర్ 27 (మనం న్యూస్) :** అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం నియోజకవర్గం దేవీపట్నం మండలంలో పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల 44 గ్రామాల గిరిజన మత్స్యకారులు. వీరిలో కొన్ని మత్స్యకార కుటుంబాలు చేపల వేటపై ఆధార పడుతున్నారు. నిర్వాసిత ప్రజల సంపదను కొంతమంది స్థానికుల అండదండలతో స్థానికేతర్లు కొల్లగొడుతున్నారు అనేది ప్రధానమైన టువంటి అంశం.గోదావరి గర్భంలో వీరవరం, దండంగి, దేవిపట్నం నిర్వాసిత గ్రామాల్ని అడ్డాగా స్థావరాన్ని ఏర్పాటు చేసుకుని మైదాన ప్రాంతాల నుండి వచ్చిన లోవ కింగ్ అనే స్థానికేతర వ్యక్తి.

ఏజెన్సీ ఏరియాలో కొంత మంది వేటగాళ్లను కూలీలుగా ఏర్పాటు చేసుకొని చీరమేను అలివి వలలతో వేటాడి గోదావరి గర్భంలో గల సీడు- ఫీడు ను వేట ద్వారా బంధిస్తున్నాడు. ఇతర రాష్ట్రాలకు, దేశాలకు దొంగతనంగా అతి విలువైన ఔషధ విలువలు కలిగిన లక్షలాది రూపాయల విలువైన పెద్ద పరిగెలు, వాలుగలు, జల్లలు, వంజులు, చేరమీను, చిన్న రొయ్య, నల్ల గండుమీను, ఉల్లింకలు (స్మగ్లింగ్) ఎగుమతి చేస్తున్నాడు. టన్నులకొద్దీ బొలెరో వ్యాన్లపై ఐస్ బాక్స్ లలో ఇతర రాష్ట్రాలకు దేశాలకు ఎగుమతి చేస్తూ కోట్లాది రూపాయల సంపదను కొల్లగొడుతున్నాడు. పీసా చట్ట ప్రకారం గిరిజన ప్రాంత పంచాయతీలకు చెందకుండా మైదాన ప్రాంత గిరిజనేతరులకు, వ్యాపారులు, అంతర్రాష్ట్ర వేటగాళ్లు దోచుకుపోతున్న మత్స్యశాఖ అధికారులు పట్టించుకోవడం లేదనేది స్థానికుల ఆవేదన. గురువారం ఉదయం ఫారెస్ట్, మత్స్యశాఖ అధికారులు పోలీసులతో కలిసి మూకుమ్మడి దాడి చేసి కొన్ని బోట్లను లోవరాజు అనే వ్యక్తికి సంబంధించిన ఒక టాటా మ్యాజిక్ పైన రెండు బోట్లు వలలతో ఉన్న వ్యాన్ ను స్వాధీనం చేసుకున్నారు. కనీసం కేసు నమోదు చేయకుండా వదిలేయడంపై సర్వత్ర అనుమానం వ్యక్తం అవుతుంది.

### లోవ కింగ్‌ని తప్పించారా? తప్పించుకున్నాడా?

అసలు ఈ లోవ కింగ్ ఎవరు? ఎందుకు అధికారులు ఇతన్ని కాపాడడానికి ఎందుకు ప్రయత్నిస్తున్నారు అనేది అర్థం కాని ప్రశ్న. ఇక్కడ జరుగుతున్న చిన్న చేపల స్మగ్లింగ్ వ్యవహారం వెనుక ఉన్న పెద్ద వ్యక్తులు ఎవరనేది అధికారులకే తెలియాల్సి ఉంది.

ఇక్కడి తీరంపై ఆధారపడి జీవించవలసిన 44 గ్రామాల పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులు అన్నమో రామచంద్ర అంటూ రాజమండ్రి, కోరుకొండ, గోకవరం పరిసర ప్రాంతాల్లో వలస కూలీలు గా ఉన్నారు. నిర్వాసిత గిరిజనులను మత్స్యశాఖ అధికారులు మత్స్య శాఖ సంఘాలుగా ఏర్పాటు చేసి ఉపాధి కల్పించడంలో విఫలం అయ్యారు అనేది బహిరంగ విమర్శ. దళారి వ్యవస్థకు సహాయ సహకారాలు అందిస్తూ మత్స్య శాఖ సంపదను దోచుకుపోయే దొంగలకు తలారిలకు సహాయ సహకారాలు అందిస్తున్నారని నిర్వాసిత గిరిజనులు



వాపోతున్నారు.

### జాయింట్ ఆపరేషన్‌లో దొరికిన నిందితులపై కేసుల నమోదు సంగతేంటి?

మనం తెలుగు దైలీ పత్రిక లో చిన్న చేప స్మగ్లింగ్ పెద్ద అధికారులు మొద్దు నిద్ర అంటూ రాసిన కథనానికి స్పందిస్తూ పోలీస్ మత్స్యశాఖ అటవీ శాఖ అధికారులు జాయింట్ ఆపరేషన్ చేపట్టారు. దీనిలో భాగంగా విలువైన మత్స్య సంపద కొల్లగొట్టుకొని పోతున్న దోపిడీదారులను పట్టుకున్నారు.చీరమేను అలివి వేట వలల వేట, తెప్పలు, బోట్లు తో, వేటగాళ్ల ను మూడు శాఖల అధికారులు అదుపులోకి తీసుకున్నారు.ఓవైపు వేట నిషేధం లో ఉండగా వలలతో దొరికిన మత్స్యసంపదను సీజ్ చేయలేదు సరి కదా ఏ ఒక్కరి పైన క్రిమినల్ చర్యలు తీసుకోలేదు.

నిషేధిత వేట పరికరాలను, బోట్లను విద్యుత్ సామాగ్రిని సీజ్ చేసి కోర్టులో ప్రవేశపెట్టి వారిపై చర్యలు తీసుకోకపోతే మత్స్యకార మరియు నిర్వాసిత గిరిజనులమైన తాము రంపచోడవరం ఎఫ్ఎంసి కోర్టులో పబ్లిక్ లిటికేషన్ పిటిషన్ వేసి ఈ చేపల వేట వెనుక ఉన్న బాగోతాన్ని నడుపుతున్న దళారులని ప్రతివాదులుగా చేర్చి న్యాయపోరాటానికి దిగుతామని నిర్వాసిత గిరిజన మత్స్య కారులు పత్రికాముఖంగా తెలియజేశారు.



మొత్తం మీద మూడు శాఖల అధికారులు చిన్న చేప స్మగ్లింగ్ అంశంపై ఉరుకులు పరుగులు తీసిన ఒక్క కేసు నమోదు చేయకపోవడం పై అధికారుల వివరణ ఆశ్చర్యకరంగా ఉంది. స్థానిక గ్రామస్తులు ఎవరైనా నిందితులపై ఫిర్యాదు చేస్తే అప్పుడు కేసులు కడతామని తెలియజేయడంలో అనేక అనుమానాలకు తావిస్తోంది. మరి ఈ జాయింట్ ఆపరేషన్ అర్థం ఏంటో సంబంధిత అధికారులే చెప్తే బాగుంటుంది అని స్థానికులు గుసగుసలాడుకుంటున్నారు.

## గ్లోబల్ యూనివర్సిటీ ఫెయిర్ విద్యార్థులు, తల్లిదండ్రులకు మార్గదర్శకం





**తగరపువలస, సెప్టెంబర్ 27(మనం న్యూస్) :** ఇప్పటి కాలంలో విద్యార్థులకు ఎన్నో కెరీర్ అవకాశాలు ఉన్నాయి. గ్లోబల్ యూనివర్సిటీ ఫెయిర్ కు వెళ్లడం ద్వారా వారు వివిధ కోర్సులు, అవకాశాలు తెలుసుకొని, సరైన దారిని ఎంచుకోవడానికి సహాయపడుతుంది. అటువంటి గ్లోబల్ యూనివర్సిటీ ఫెయిర్ శుక్రవారం ఒక్రిడ్జ్ ఇంటర్నేషనల్ పాఠశాల లో నిర్వహించారు. అమెరికా, బ్రిటన్, ఇండియా, చైనా, ఆస్ట్రేలియా, యూరప్, సింగపూర్, కెనడా వంటి దేశాలలో ఉన్న 60కి పైగా ప్రఖ్యాత యూనివర్సిటీల ప్రతినిధులు ఈ ఫెయిర్లో పాల్గొన్నారు. 500 మందికి పైగా విద్యార్థులు, తల్లిదండ్రులు విశాఖపట్నం నుండి ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ ఫెయిర్ ద్వారా విద్యార్థులు యూనివర్సిటీ ప్రతినిధులతో మాట్లాడి, కొత్త- కెరీర్ అవకాశాలు, అడ్మిషన్ వివరాలు, స్కాలర్షిప్ అవకాశాల గురించి తెలుసుకోగలిగారు. అదనంగా, యూనివర్సిటీకి దరఖాస్తు చేయడానికి అవసరమైన సూచనలు కూడా పొందగలిగారు. ఈ సందర్భంగా ఒక్రిడ్జి ఇంటర్నేషనల్ స్కూల్ ప్రిన్సిపాల్ శైల భమిడిపాటి మాట్లాడుతూ, ఈ యూనివర్సిటీ ఫెయిర్ ద్వారా విద్యార్థులకు ఉన్నత విద్యకు సంబంధించిన సరైన నిర్ణయాలు తీసుకునే మార్గదర్శకం అందించడం మా లక్ష్యం అన్నారు. ఈ కార్యక్రమం లో ఒక్రిడ్జి ఇంటర్నేషనల్ స్కూల్ డైరెక్టర్ అమిత్ జైన్ పాల్గొన్నారు.

## కొండ లక్ష్మణ్ బాపూజీ సేవలు స్ఫూర్తిదాయకం



**ఆత్మకూరు (ఎం), సెప్టెంబర్ 27 (మనం న్యూస్) :** తెలంగాణ ఉద్యమంలో తమదైన పాత్ర పోషించిన స్వతంత్ర్య సమరయోధులు, మాజీ మంత్రి కొండ లక్ష్మణ్ బాపూజీ సేవలు స్ఫూర్తిదాయకం, చిరస్మరణీయం అని వారి జయంతి సందర్భంగా శుక్రవారం సరస్వతీ విద్యాలయం పాఠశాలలో ఘన నివాళులు అర్పించి వారి గొప్పతనాన్ని విద్యార్థులకు వివరిస్తూ పేద విద్యార్థినికి నూతన వస్త్రాలు బహుకరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ తొర్ర విష్ణు, ప్రిన్సిపల్ పంజాల నర్సయ్య,వైస్ ప్రిన్సిపల్ ఐలయ్య, సుధాకర్,విష్ణు,యాసిన్,లలిత,సంతోష, మహేశ్వరి, సంధ్య, మాధవి, ఆదర్శ, శైలజ,కృష్ణవేణి,మాధవి,గంగా,లక్ష్మి, మమత, అప్రజితలు పాల్గొన్నారు.

## మండలంలోని పలు గ్రామాలలో పర్యటన



- ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి

**మునుగోడు,సెప్టెంబర్ 27(మనం న్యూస్) :** మునుగోడు మండలలోని సింగారం, పులిపలుపుల, కొంపల్లి గ్రామలలో ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి శుక్రవారం ఉదయం పర్యటించారు.ముందుగా చౌరస్తాలో ఆటోలో స్కూలుకు వెళుతున్న విద్యార్థులను చూసి ఆటో డ్రైవర్ను పరిమితికి మించి ఎక్కించుకోకూడదని హెచ్చరించారు. అనంతరం పులిపలుపుల గ్రామ పాఠశాలను సందర్శించి పలు సమస్యల గురించి ఆరా తీశారు. పిల్లల భవిష్యత్తు చదువుతూనే ముడిపడి ఉంటుందని చదివి విషయంలో రాజి పడొద్దని అన్నారు. చదివి ఎంత ముఖ్యమో ఆటలు కూడా అంతే ముఖ్యం ప్రతి పాఠశాలలో గ్రౌండ్ ఏర్పాటు చేయాలని తెలిపారు. విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు.పలు వార్డులలో తిరిగి ప్రజాలెదుర్కొంటున్న డ్రైనేజీ, విద్యుత్, రోడ్లు ఇతర సమస్యలను తెలుసుకొని వెంటనే సంబంధిత అధికారులకు ఆదేశించారు. విద్యుత్ సమస్యలను పూర్తిగా పరిష్కరించాలని నియోజకవర్గంలో సింగారం మోడల్ గ్రామంగా తీర్చిదిద్దాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. సమస్యలను నేరుగా తెలుసుకొని పరిస్కారానికి చర్యలు తీసుకోవాలనే లక్ష్యంతో గ్రామాల్లో పర్యటిస్తున్నానని, అభివృద్ధి పనులను దశల వారీగా పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు. గ్రామల అభివృద్ధికి ప్రత్యేక చొరవచూపుతానని తెలిపారు.గ్రామంలో నూరుశాతం మద్యం అమ్మకాలను బంధు చేయించడం పట్ల ప్రజలను అభినందించించిన ఎమ్మెల్యే గ్రామానికి ప్రత్యేకంగా వెంటనే 10 లక్షల రూపాయల నిధులను కేటాయిస్తున్నానని అత్యవసరమైన పనులు చేయించుకోవాలని చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు పలు సమస్యలతో కూడిన వినతిపత్రంను గ్రామస్థులు అందజేశారు. ముందుగా ఎమ్మెల్యేను పలువురు శాలువాలు, పూలబొకేలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో. డిసిసిబి చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి మురళి, వివిధ శాఖల అధికారులు, గ్రామ స్పెషల్ ఆఫీసర్ నరేష్, పంచాయతీ కార్యదర్శి గీత, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు భీమనపల్లి సైదులు, జాజుల ఆంజయ్య, పాల్వాయి చెన్నారెడ్డి, పాల్వాయి జితేందర్ రెడ్డి, జాల వెంకన్న, మేకల మల్లయ్య, గ్రామ శాఖ అధ్యక్షుడు కుంభం చెన్నారెడ్డి, మాజీ సర్పంచులు కోడి చంద్రయ్య, పోగుల జానకి ప్రకాష్, జిల్ల లక్ష్మమ్మ వెంకటేష్, ఉప్పునూతల రమేష్, గ్రామ సీనియర్ నాయకులు, పెద్ద సంఖ్యలో గ్రామస్థులు పాల్గొన్నారు.

## ఆర్థిక సహాయం అందజేత

**భువనగిరి, సెప్టెంబర్ 27 (మనం న్యూస్) :** భువనగిరి పట్టణంలోని అర్బన్ కాలనీ 1 వ వార్డ్ కీ చెందిన మిర్చి బండి చిరు వ్యాపారి నిడిగొండ శివశంకర్ ఆకస్మికంగా చనిపోవడం జరిగింది. మాజీ కౌన్సిలర్, జిల్లా గ్రంధాలయం మాజీ డైరెక్టర్, పోలిశెట్టి ఫౌండేషన్ చైర్మన్ పోలిశెట్టి అనిల్ కుమార్ వెళ్లి శంకర్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. వారి కుటుంబ సభ్యులను ఓదార్చి వారికీ పోలిశెట్టి ఫౌండేషన్ ద్వారా 5000 వేల రూపాయలు ఆర్థిక సాయం చేయడం జరిగింది. భవిష్యత్తులో వారి కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని ధైర్యం చెప్పడం జరిగింది. వారి పిల్లల చదువులకు తన వంతు సహాయం చేస్తా అని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పత్తి రమేష్, వస్తుపుల అభినేయ, సందీప్, మణికంఠ, రవి, శ్రీను, బాలు, నరేష్, లింగం వారి కుటుంబం సభ్యులు పాల్గొన్నారు.

## అకాల వర్షం కారణంగా నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

- సిపిఎం చండూరు మండల కార్యదర్శి జెర్రిపోతుల ధనంజయ గౌడ్




**చండూరు,సెప్టెంబర్ 27(మనం న్యూస్) :** అకాల వర్షం కారణంగా చండూరు మండల పరిధిలోని వివిధ గ్రామాలలో ప్రత్తి పంట, ఇతర పంటలువేసుకున్న రైతులు నష్టపోయారని వారిని ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఎం చండూరు మండల కార్యదర్శి జెర్రిపోతుల ధనంజయ గౌడ్ అన్నారు. శుక్రవారం సిపిఎం ఆధ్వర్యంలో చండూరు మండల పరిధిలోని నేర్మట గ్రామంలో రైతులు వేసుకున్న ప్రత్తి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇటీవల కురిసిన వర్షాల వలన తెల్ల బంగారం ఎర్ర బారిందని ఆయన అన్నారు.నేర్మ ట గ్రామంలో పత్తి పంట వేసుకున్న రైతులు కొంపెల్లి ఉశయ్య, బురకల అంజయ్య, మాధగోని హనుమంతు వీరి పంటలు వర్షాల కారణంగా పూర్తిగా నష్టపోయారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.మండల పరిధిలోనిఏ గ్రామాలలోఏ పంట నష్టపోయిందోవ్యవసాయ అధికారులు, రెవెన్యూ అధికారులు పంటల వారిగా సర్వే చేసి, నష్టపోయినరైతాంగాన్ని ఆదుకోవాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. వ్యవసాయానికి పెరుగుతున్న రేట్లకు అనుగుణంగావిత్తనాలు,ఎరువుల ధరలు విపరీతంగా పెరిగిన రిత్యా ఎకరానికి 25 వేల రూపాయలు నష్టపరిహారం చెల్లించి, రైతాంగానికి ఆదుకోవాలనిఆయన అన్నారు. ఎలాంటి షరతులు లేకుండా రెండు లక్షలు రుణమాఫీ చేయాలని, రైతు భరోసా నిధులు వెంటనే విడుదల చేయాలని ఆయన అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని లేనిపక్షంలో రైతులందరినీ కలుపుకొని ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలోసిపిఎం నేర్మ ట గ్రామ శాఖ కార్యదర్శి బల్లం స్వామి, రైతు సంఘం నాయకులుకొత్తపల్లి నరసింహ, గ్రామ రైతులుకొంపెల్లి ఉషయ్య, మాధగోని హనుమంతు, బుర్కల అంజయ్య, ఈరగట్ల యాదయ్య, నారాపాక లింగాలు, ఈరటి వెంకన్నతదితరులు పాల్గొన్నారు.

## ప్రజాపాలన అంటే ఇదేనా..?

### నల్ల భూపాలరెడ్డి

- రాజకీయాలకతీతంగా వరద బాధితులను ఆదుకోవాలి
- అధికార పార్టీ నాయకులు చెప్పిన పేర్లు మాత్రమే లిస్టులో



**అనంతగిరి,సెప్టెంబర్ 27 (మనం న్యూస్) :** ఇటీవల కురిసిన వానలకు నష్టపోయిన వరద బాధితులందరికి సమన్యాయం జరగడం లేదని బాధితులందరికీ న్యాయం చేయాలని కోరుతూ బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు నల్లా భూపాల్ రెడ్డి ఆధ్వర్యంలో తహసిల్దార్ హిమబిందుకు వినతి పత్రాన్ని అందజేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఇటీవల కురిసిన భారి వర్షల వల్లన మండల పరిధిలోని చనుపల్లి గొంద్రియాల గ్రామాల నందు పాలేరు వాగు ఉధృతంగా మారటంతో ఇండ్లలలోకి నీరు చేరి భారీ ఎత్తున నష్టం వాటిల్లిన విషయం తెలిసిందే అయితే అదికారులు వచ్చి సర్వే చేసి పేర్లు రాసుకొని వెళ్ళారుగాని లబ్ధిదారుల లిస్ట్ లొ భాదితుల పేర్లు రాకపోవటం చాలా బాధాకరంగా ఉందని వరద భాదితుల విషయంలొ రాజకీయాలకు అతతంగా నష్టపోయిన బాధితులకు నష్ట పరిహారం చెల్లించాలసింది పోయి భాదితులకు ఆన్యాయం చేసే విధంగా కొంతమంది రాజకీయ నాయకుల వ్యూహాన్ని అధికారుల పై రుద్దడం చాలా విడ్డూరంగా వుందని ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్పందించి వరద బాధితులకు తక్షణమే నష్టపరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబాలకు న్యాయం జరిగే వరకు వారి తరుపున పోరాటం చేయటానికి బిఆర్ఎస్ పార్టీ ఎప్పుడు సిద్ధంగా ఉంటుందని అవసరమైతే భాదితులందరిని తీసుకొని ప్రజావాణి కి వెళ్లి వారి సమస్యలను పరిష్కరించే వరకు పోరాటం చేస్తామని ప్రజాపాలన అంటే ఇదేనా అని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ ఉపాధ్యక్షులు అఫ్జల్ సైదిరెడ్డి అక్బర్ శివ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## సాగర్‌లో ఘనంగా ప్రపంచ పర్యాటక దినోత్సవాలు

**నాగార్జునసాగర్, సెప్టెంబర్ 27(మనం న్యూస్) :** నాగార్జునసాగర్ లో పర్యాటక అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ పర్యాటక దినోత్సవం ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర పర్యాటక వృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రకాష్ రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా పర్యాటక ప్రాంతాలలో పర్యాటకులను ఆకట్టుకునే విధంగా టూరిజం అండ్ పీస్ అనే నినాదంతో పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు .దీనిలో భాగంగా శుక్రవారం నాడు నాగార్జునసాగర్ లోని విజయ విహార్ ప్రాంగణంలో సాంప్రదాయ బద్ధమైన కోలాటం నృత్యాలతో, లంబాడీ నృత్యాలతో, బతుకమ్మలఆటలతో ,పాటలతో నిర్వహించిన పలు సాంకృతిక కార్యక్రమాలు పలువురుని ఆకట్టుకున్నాయి. ప్రపంచ పర్యటక దినోత్సవ సందర్భంగా నాగార్జునసాగర్ లోని పర్యాటక ప్రాంతాలైన విజయ విహార్ ను రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక విజయ విహార్ మేనేజర్ కిరణ్ కుమార్, సూపర్వైజర్ శ్రీధర్ ,పర్యాటక శాఖ సిబ్బంది సత్యనారాయణ, విజయకుమార్ మరియు టూరిజం సిబ్బంది పాల్గొన్నారు.

# మహనీయుల జీవితాల నుంచి విలువలను నేర్చుకోవాలి

- యువతకు జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సూచన
- ఘనంగా కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి

**ఖమ్మం, సెప్టెంబర్ 27(మనం న్యూస్):** మహనీయుల జీవితాల నుంచి వారు పాటించిన విలువలను యువత నేర్చుకోవాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. శుక్రవారం కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని పురస్కరించుకొని స్థానిక లకారం ట్యాంక్ బండ్ వద్ద ఏర్పాటు చేసిన జయంతి వేడుకలలో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, అదనపు కలెక్టర్ లు డా. పి. శ్రీజ, డి. మధుసూదన్ నాయక్ లతో కలిసి పాల్గొన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి, చిత్ర పటానికి జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ లు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ, సమాజంలో ఆశించిన మార్పు కోసం, ప్రతి ఒక్కరి అభివృద్ధి కోసం పాటుపడిన మహనీయులలో కొండా లక్ష్మణ్ బాపూజీ ఒకరని తెలిపారు. వెనుకబడిన ప్రాంతం నుండి వచ్చి కూడా గొప్ప ఆలోచనతో కొండా లక్ష్మణ్ బాపూజీ పని చేశారని అన్నారు. సమాజంలో ఆశించిన మార్పు తీసుకుని రావాలంటే గట్టి ఆలోచన, మంచి మనసు కావాలని అన్నారు. ప్రతి సంవత్సరం మహనీయుల జయంతి వేడుకల నిర్వహణ ద్వారా యువకులు వారి జీవితం నుంచి చాలా నేర్చుకోవాలని అన్నారు. మనం ఆశించిన మార్పు కోసం ఎన్ని



కష్టాలు వచ్చినా దృఢంగా ఉండి సాధించాలని చేసి చూపించిన మహనీయులు కొండా లక్ష్మణ్ బాపూజీ అని, తన జీవితంలో క్విట్ ఇండియా పోరాటం, హైదరాబాద్ పోరాటం, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం పోరాడారని, ఇది ఆయన జీవితం నుంచి మనం నేర్చుకోవాల్సిన గొప్ప విషయమని కలెక్టర్ పేర్కొన్నారు. 40 సంవత్సరాల పాటు ఎన్ని కష్టాలు వచ్చినా పోరాటాన్ని కొండా లక్ష్మణ్ బాపూజీ విడిచి పెట్టలేదని, ఆయన జీవితం నుంచి నేటి యువత ఓపికను నేర్చుకోవాలని అన్నారు. జీవితంలో విజయం మనకు ఒక రోజు, రెండు రోజుల్లో రాదని, ఓపికతో కష్టపడి సాధించిన ఫలితాలే శాశ్వతంగా నిలిచిపోతాయని కలెక్టర్ తెలిపారు. మహనీయులు అందించిన విలువలు ప్రతి రోజు స్మరించుకోవాలని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ మాట్లాడుతూ, ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి వంటి వెనుకబడిన ప్రాంతం నుండి వచ్చిన కొండా లక్ష్మణ్ బాపూజి చిన్నతనంలోనే తల్లిని కోల్పోయారని, ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం పోరాడారని, తాను నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి జీవితాంతం చిత్తశుద్ధితో పోరాటం సాగించారని, ఆ లక్షణాన్ని మనమంతా నేర్చుకోవాలని అన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డి. మధుసూదన్ నాయక్ మాట్లాడుతూ, బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి పాటుపడిన మహనీయులు కొండా లక్ష్మణ్ బాపూజీ అని, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమం కోసం తన ఇంటిని, ఆస్తులను ధారాదత్తం చేశారని, ఆ మహనీయుని స్మరించుకోవడం మనందరి అదృష్టమని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ అభివృద్ధి అధికారిణి జి. జ్యోతి, బిసి స్టడీ సర్కిల్ డైరెక్టర్ శ్రీలత, జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షులు బొమ్మ రాజేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి చిలకమర్రి శ్రీనివాస బాబు, రాష్ట్ర గౌడ సంఘం అధ్యక్షులు అమరగాని వెంకటేశ్వర్లు, వర్కింగ్ ప్రెసిడెంట్ తాటి శ్రీనివాస్, ఖమ్మం నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు పెండెం జనార్ధన్, బండారు శ్రీను, బీసీ సంఘం అధ్యక్షులు పిండిప్రోలు రామ్మూర్తి, ఉద్యోగ విభాగం అధ్యక్షులు రచ్చ శ్రీను, రిటైర్డ్ ఉద్యోగ విభాగం అధ్యక్ష, కార్యదర్శులు సత్యనారాయణ, పిల్లల మర్రి కొండలరావు, జిల్లా కోశాధికారి గుడ్ల వీరభద్రం, జిల్లా ఉపాధ్యక్షులు గుడ్ల శ్రీను, యువజన విభాగం అధ్యక్ష, కార్యదర్శులు టి. సంపత్ కుమార్, చందా వీరభద్రం, మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి ఇందుమూరి సంధ్యారాణి, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ చరిత్రలో ఆచార్య బాపూజీ అజరామరం

- మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు

**ఖమ్మం, సెప్టెంబర్ 27(మనం బ్యూరో):** తెలంగాణ తొలి తరం ఉద్యమ నాయకులు, తెలంగాణ బోళాతనానికి నిలువుటద్దం, ఉద్యమాల ముద్దుబిడ్డగా ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ తెలంగాణ చరిత్రలో అజరామరమని బీఆర్ఎస్ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు అభిప్రాయపడ్డారు. జీవితమంతా తెలంగాణ పక్షమే వహించిన ఆచార్య బాపూజీ, తన చివరి శ్వాస వరకూ తెలంగాణ కోసం శ్వాసించారని నామ గుర్తుచేశారు. ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా యావత్ తెలంగాణ సమాజం బాపూజీకి ఘన నివాళులు అర్పించడం మనందరి కర్తవ్యమని నామ అన్నారు. స్వాతంత్ర్య పోరాటం నుంచి బడుగు వర్గాల గళం దాకా దశాబ్దాల ఉద్యమ జీవితం ఆయనది అని ఆయన అన్నారు. నిజాం పాలనపై యుద్ధం చేసిన ధీరుడు, భారత స్వాతంత్ర్యం కోసం చేసిన పోరాటంలో భాగస్వామిగా ఉండటమే కాకుండా, తెలంగాణ సమస్యలపై ప్రత్యేక దృష్టిపెట్టిన నాయకుడని, అందుకే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు పట్ల అవిశ్రాంత శ్రద్ధ చూపించారని నామ పేర్కొన్నారు. స్వాతంత్ర్యోద్యమంలో, నిరంకుశ నిజాం పాలన వ్యతిరేక ఉద్యమాల్లో చురుకుగా పాల్గొన్న ఆచార్య బాపూజీ, తెలంగాణ కోసం మంత్రి పదవిని తృణప్రాయంగా వదిలేసిన నిబద్ధత కలిగిన రాజకీయవేత్త అని గుర్తుచేశారు. నేడు ఆయన జయంతి సందర్భంగా బాపూజీ స్మరణ మనందరి కర్తవ్యమని మాజీ ఎంపీ నామ అన్నారు.

## సమగ్రాభివృద్ధి తుమ్మల ధ్యేయం

- ఖమ్మం మేయర్ పునుకొల్లు నీరజ



**ఖమ్మం, కార్పొరేషన్, సెప్టెంబర్ 27 (మనం న్యూస్) :** ఖ మ్మం నగర సమగ్ర అభివృద్ధి ధ్యేయంగా మంత్రి తుమ్మల నాగేశ్వ రావు పనిచేస్తున్నారని ఖమ్మం నగర పాలక సంస్థ మేయర్ పునుకొ ల్లు నీరజ పేర్కొన్నారు. ప్రజా సమస్యలన్నింటిని కాంగ్రెసు సర్కార్ పరిష్కరిస్తుందన్నారు. రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రజా స మస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని తెలిపా రు. ప్రజా సమస్యలు తమ దృష్టికి రాగానే వెను వెంటనే చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. మంత్రి సూచనల మేరకు కళ్యాణ ల క్ష్మి చెక్కులను 31, 33, 34, 35, 46, 48 డివిజన్లలో పంపిణీ చేశా మన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ తుమ్మల యుగేందర్, కాంగ్రెస్ ఏ బ్లాక్ అధ్యక్షులు యర్రం బాలగంగాధ తిలక్, స్థానిక కార్పొరేట ర్లు, కాంగ్రెస్ నాయకులు రుడవత్ రమాదేవి, బాణాల లక్ష్మణ్, బెడ దం సత్యనారాయణ,సింగం అంజయ్య,తల్లాడ రమేష్,లక్కీ ఉపేం దర్, సాధే శంకర్,నల్లపు శ్రీనివాస్,హౌడు,వెంకన్న,టిజు.రజ్జి, బోజడ్ల సత్యనారాయణ, మంగ, రవి, సాయి తదితరులు పాల్గొన్నారు.

## కొండ లక్ష్మణ్ బాపూజీ జీవితం నేటి తరానికి ఆదర్శనీయం

- కొండ లక్ష్మణ్ బాపూజీ స్ఫూర్తితో ముందుకెళ్లాలి
- క్రమశిక్షణకు మారు పేరు బాపూజీ
- అదనపు కలెక్టర్ టి.పూర్ణచంద్ర



**నల్లగొండ,సెప్టెంబర్ 27(మనం ప్రతినిధి) :** కొండా లక్ష్మణ్ బాపూజీ జీవితం నేటి సమాజానికి ఆదర్శమని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ టి.పూర్ణ చంద్ర అన్నారు.కొండ లక్ష్మణ్ బాపూజీ 109 వ జయంతిని పురస్కరించుకొని శుక్రవారం అయన నల్గొండ జిల్లా కేంద్రంలోని హైదరాబాద్ రోడ్లో ఉన్న కొండ లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాటస్ఫూర్తి తెలంగాణ ఉద్యమం కోసం తన సొంత ఇంటిని త్రుణప్రాయంగా వదిలేసిన ఉద్యమ స్ఫూర్తి కొండా లక్ష్మణ్ బాపూజిది అని అన్నారు. కొండ లక్ష్మణ్ బాపూజీ మూడేళ్ల వయసులోనే తల్లిని కోల్పోయారని, ఎంతో కష్టపడి చదివి పైకి వచ్చారని తెలిపారు. కొండ లక్ష్మణ్ బాపూజీ క్రమశిక్షణ అందరికి ఆదర్శమని , ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో ఉంటే ఏ స్థాయికైనా ఎదుగుతారని కొండా లక్ష్మణ్ బాపూజీ నిరూపించారని అన్నారు.మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడారు. మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్ ,బీసీ సంఘం నాయకులు, పద్మశాలి సంఘం నాయకులు తదితరులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.ఈ సందర్భంగా కొండ లక్ష్మణ్ బాపూజీ పై తడక యాదగిరి రచించిన పుస్తకాన్ని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విడుదల చేశారు.కాగా నల్గొండ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలకు అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరై కొండ లక్ష్మణ్ బాపూజి చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కార్యాలయ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్ మాట్లాడుతూ కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలు ఎనలేనివని అన్నారు.

## మృతుల కుటుంబాలకు ఆర్థిక సహాయం



**వలిగొండ, సెప్టెంబర్ 27 (మనం న్యూస్) :** వలిగొండ మండల కేంద్రంలోని బీసీ కాలనీలో ఇటీవల మృతి చెందిన కూర శివ మ్మ మరియు బుచ్చిమల్లు కుటుంబాలకు ఒక్కొక్కరికి 5000 రూపా యలు చొప్పున మండల కేంద్రంలోని భాస్కర్ మెడికల్ షాప్ యజ మాని, కాంగ్రెస్ నాయకుడు కొండూరు భాస్కర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు కంకల కిష్టయ్య, బత్తిని సైదులు, కాసుల వెంకటేశం, కొండూరు సాయి, ఎంఎస్ గౌడ్, బత్తిని నగేష్, గొలుసుల నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## వరద బాధితుల పునరావాసానికి ప్రణాళిక బద్ధంగా చర్యలు



- జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్
- వరద బాధితులు కోల్పోయిన సర్టిఫికెట్లు త్వరితగతిన అందించేందుకు కార్యాచరణ
- స్వయం ఉపాధి యూనిట్ల ఏర్పాటు ద్వారా ఆర్థిక తోడ్పాటు
- వరద సహాయక చర్యలపై డియోసెసన్ సోషల్ సర్వీస్ సొసైటీ (డి.ఎస్.ఎస్.ఎస్.కే) ఫాదర్‌లతో కలెక్టర్ సమావేశం

**ఖమ్మం, సెప్టెంబర్ 27(మనం బ్యూరో):** వరద బాధితుల పునరావాసానికి ప్రణాళిక బద్ధంగా చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ లోని కలెక్టర్ చాంబర్ లో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్ తో కలిసి వరద సహాయక పునరావాస చర్యలపై డియోసెసన్ సోషల్ సర్వీస్ సొసైటీ, ఖమ్మం (డి.ఎస్.ఎస్.ఎస్.కే) ఫాదర్ లతో సమావేశం నిర్వహించారు. ఖమ్మంలో వచ్చిన వరదల నేపథ్యంలో డి.ఎస్.ఎస్.ఎస్.కే సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన వరద సహాయక చర్యల వివరాలను కలెక్టర్ కు వివరించారు. వరదల నేపథ్యంలో ఇంకా చేయాల్సిన పనులు, సహాయం ఏమైనా ఉంటే తెలియజేయాలని డి.ఎస్.ఎస్.ఎస్.కే. సొసైటీ కోరారు. ఈ సందర్భంగా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ, వరద ప్రభావిత ప్రాంతాల పునరుద్ధరణకు జిల్లా అధికార యంత్రాంగం, స్వచ్ఛంద సంస్థలు సంయుక్తంగా, వేగవంతంగా పూర్తి చేశాయని అన్నారు. గంటల వ్యవధిలో కుంభవృష్టి వర్షం వల్ల మున్నేరు నదికి గతంలో ఎన్నడూ లేనంతగా భారీగా వరదలు వచ్చాయని, తక్కువ నష్టాలతో అధిగమించామని కలెక్టర్ తెలిపారు. ఖమ్మం నగరంలో వరదల వల్ల నష్టపోయిన కుటుంబాలను ఆర్థికంగా నిలబెట్టే దిశగా పునరావాస చర్యలు చర్యలు తీసుకుంటామని, దీనికి డి.ఎస్.ఎస్. ఎస్.కే. సొసైటీ సహకారం అవసరమని కలెక్టర్ తెలిపారు. ఖమ్మం నగరంలో దాదాపు 10 వేలకు పైగా కుటుంబాలకు వరదల వల్ల నష్టం జరిగిందని, ముందస్తుగా బాధితులకు అవసరమైన విద్యా , రెవెన్యూ మొదలగు సర్టిఫికెట్లు అందేలా చర్యలు చేపట్టామని అన్నారు. వరద బాధితులకు ఉపాధి కల్పనకు వివిధ ప్రభుత్వ పథకాలలో ప్రాధాన్యత కల్పిస్తూ స్వయం ఉపాధి యూనిట్ల ఏర్పాటు చేస్తామని తెలిపారు. స్వయం ఉపాధి యూనిట్ల ఏర్పాటు, చిన్న, చిన్న వ్యాపారాల నిర్వహణ వంటి అంశాలలో వరద బాధితులకు అవసరమైన శిక్షణ కల్పించేందుకు డి.ఎస్.ఎస్.ఎస్.కే. సొసైటీ సహకరించాలని, భవిష్యత్తులో వచ్చే వరదల వల్ల నష్టం జరగకుండా అన్ని చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో ఖమ్మం డియోసెసన్ సోషల్ సర్వీస్ సొసైటీ డైరెక్టర్ ఫాదర్ సురేష్, ఖమ్మం మేత్రాసన గురువులు ఫాదర్ అమల్, ఫాదర్ సెల్విన్, ఫాదర్ తప్పేట శౌరీ, ఫాదర్ సుధాకర్, ఫాదర్ బత్తుల జయరాజు, ఫాదర్ ఐసక్, ఫాదర్ గోరంట్ల చార్లెస్, మదర్ థెరిస్సా సిస్టర్స్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు పర్యాటక ప్రాంతాలపై అవగాహన కల్పించాలి

- వాటి ప్రాముఖ్యత తెలియజేయాలి
- భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్

**భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 27 (మనంప్రతినిధి):** విద్యార్థులకు పర్యాటక ప్రాంతాలపై అవగాహన కల్పించి వాటి ప్రాముఖ్యత తెలియజేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. మంచి పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాలోని క్రీడా సంఘాల అసోసియేషన్ సెక్రటరీలు, క్రీడాకారులు, ఎన్ ఎస్ ఎస్, ఎన్ సి సి విద్యార్థులు, జిల్లాస్థాయి యువజన ఉత్సవాలలో గెలుపొందిన యువ కళాకారులను చంద్రుగొండ మండలం బెండల పాడు అటవీ ప్రాంతం కనిగిరి గుట్టల విహారయాత్ర సందర్భంగా శుక్రవారం ఐ డి ఓ సి కార్యాలయం నుండి జెండా ఊపి ప్రారంభించారు. ఈ విహారయాత్రలో రెండు బస్సుల్లో సుమారు 100 మందిన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యువత సమయం ఉన్నప్పుడు జిల్లాలోని ఉన్న పర్యాటక ప్రాంతాలకు ఎక్కువగా వెళ్లి వాటి గొప్పతనాన్ని అందరికీ తెలియజేయడం ద్వారా మరింత అభివృద్ధి జరుగుతుందన్నారు. అలాగే బెండలపాడు అటవీ ప్రాంతం మరియు కనిగిరి గుట్టల వంటి ప్రకృతి ప్రదేశాలకు వెళ్లి ఆహ్లాదకరంగా గడిపి ఆ ప్రాంతం గొప్పతనం అందరికీ తెలియజేయాలన్నారు. అదేవిధంగా అలాంటి ప్రదేశాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరి మీద ఉన్నదని అన్నారు.అనంతరం ఈ కార్యక్రమంలో భాగంగా చంద్రుగొండ మండలం బెండలపాడు అటవీ ప్రాంత సందర్శనలో అశ్వరావుపేట శాసనసభ్యులు జారే ఆదినారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన్ద మాట్లాడుతూ యువత మరియు క్రీడాకారులతో కలిసి ఈ ప్రాంతాన్ని సందర్శించడం ఆనందంగా ఉన్నదని అన్నారు. ఈ జిల్లాలో పర్యాటక ప్రదేశాలను బాగా




అభివృద్ధి చేసుకోవాలని ప్రభుత్వం నుంచి అధిక నిధులు తీసుకుని వచ్చి బెండలపాడు కనిగిరి గుట్టల ప్రాంతం ను మరింత అభివృద్ధి చేయడానికి కృషి చేస్తానన్నారు. యువత మరియు క్రీడాకారులకు అన్ని రకాలుగా సహాయ సహకారం అందిస్తానని తెలిపారు. ఈ బెండలపాడు అటవీ ప్రాంతం విహారయాత్రకు వెళ్లిన వారిలో జిల్లా యువజన మరియు క్రీడల అధికారి ఎం.పరందామా రెడ్డి, జిల్లా ప్లానింగ్ అధికారి మరియు చంద్రుగొండ స్పెషల్ ఆఫీసర్ కే. సంజీవ రావు, గవర్నమెంట్ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ వనజ, కో-ఆర్డినేటర్ పూర్ణ చందర్, అథ్లెటిక్ సెక్రటరీ మహిదర్, బాక్సింగ్ సెక్రటరీ రమేష్, కరాటే సెక్రటరీ శ్రీధర్, హాకీ కోచ్ ఇమామ్, ఆర్చరి కోచ్ కళ్యాణ్, అథ్లెటిక్ కోచ్ నాగేందర్, క్రీడాకారులు, జూనియర్ కాలేజీ, సోషల్ వెల్ఫేర్ కాలేజీ విద్యార్థులు పాల్గొన్నారు.

## పారిశుధ్య కార్మికుల సేవలు అమోఘం : ఐటీడీఏ పీవో



**భద్రాచలం, సెప్టెంబర్ 27( మనం న్యూస్):** శ్రీ సీతారామచంద్ర స్వామి కొలువై ఉన్న భద్రాచలంలో ప్రతిరోజు భక్తులు వస్తూ ఉంటారని ,అటువంటి భద్రాచలాన్ని పరిశుభ్రత విషయంలో గ్రామపంచాయతీ సిబ్బంది చేస్తున్న సేవలు ప్రశంసనీయమని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి, గ్రామపంచాయతీ స్పెషల్ ఆఫీసర్ బి. రాహుల్ అన్నారు. శుక్రవారం నాడు భద్రాచలంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన స్వచ్ఛత హీ సేవ లో భాగంగా గ్రామపంచాయతీ పరిశుభ్రత కార్మికుల చేత స్వచ్ఛ ప్రతిజ్ఞ చేయించిన అనంతరం ఆయన మాట్లాడుతూ భద్రాచలంలో ప్రతి సంవత్సరం గోదావరి నిమజ్జనం చేయడానికి వినాయక ప్రతిమలు వస్తూ ఉంటాయని ,అలాగే బ్రహ్మోత్సవాలు, ముక్కోటి, సీతారామచంద్రస్వామి కళ్యాణము వంటి కార్యక్రమాలు జరుగుతూ ఉంటాయని, భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా గ్రామపంచాయతీ సిబ్బంది ఉదయము,సాయంత్రము పరిశుభ్రత విషయంలో మంచి జాగ్రత్తలు తీసుకొని తడి చెత్త పొడి చెత్త వేరువేరుగా సేకరించి డంపింగ్ యార్డుకు తరలించి, భద్రాచలం పట్టణం శుభ్రంగా ఉండేలా కృషి చేస్తున్నారని ఆయన అన్నారు. భద్రాచలం పంచాయతీలో ట్రాక్టర్ డ్రైవర్లు, సఫాయి పనులు చేసే వర్కర్లు, ప్లంబర్లు అందరూ కలిసి 320 మంది బాధ్యతగా పనులు చేస్తున్నారని, పంచాయతీ సిబ్బంది కూడా ఉదయం సాయంత్రం వర్కర్ల యొక్క పర్యవేక్షణ పగటిబందీగా నిర్వహిస్తున్నారని ఇదే స్ఫూర్తితో పనిచేసి భద్రాచలం పట్టణాన్ని నందనవనంగా శుభ్రంగా ఉండే విధంగా వర్కర్లు కంకణం కట్టుకోని బాధ్యతగా తమ విధులు నిర్వహించాలని అన్నారు. అనంతరం సపాయి వర్కర్లకు సేఫ్టీ మెటీరియల్ తో పాటు ఇంటికి అవసరమయ్యే కాస్మోటిక్ వస్తువులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్, గ్రామపంచాయతీ ఈవో శ్రీనివాస్, ఐటీసీ వావ్ సంస్థ కోఆర్డినేటర్ రమ్య, ఫీల్ కోఆర్డినేటర్లు సౌజన్య, రాజేశ్వరి,గ్రామపంచాయతీ సిబ్బంది, వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

## చరిత్ర పట్ల విద్యార్థినులకు అవగాహన ఉండాలి

- విజ్ఞాన యాత్రలు విద్యార్థులకు ఎంతో ఉపయోగకరం
- జెడ్పి సిఇఓ దీక్ష రైనా

**ఖమ్మం, సెప్టెంబర్ 27(మనం న్యూస్):** విద్యార్థులకు చరిత్ర పట్ల అవగాహన ఉండాలని, ఇందుకై విజ్ఞాన, విహార యాత్రలు చేపట్టాలని జెడ్పి సిఇఓ దీక్ష రైనా అన్నారు. శుక్రవారం ప్రపంచ పర్యాటక దినోత్సవం పురస్కరించుకుని నేలకొండపల్లి జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులకు విజ్ఞాన యాత్రలో భాగంగా నేల కొండపల్లి బౌద్ధ స్థూప సందర్శన చేశారు. జిల్లా పర్యాటక అధికారి బి. సుమన్ చక్రవర్తి బౌద్ధ స్థూపం చరిత్ర, దాని విశేషాలు సమగ్రంగా విద్యార్థినులకు వివరించారు. ఇట్టి కార్యక్రమంలో పాల్గొన్న జెడ్పి సిఇఓ చరిత్ర పట్ల అవగాహనతోనే అభివృద్ధి సాకార మవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.




## ఘనంగా కొండా లక్ష్మణ్ బాపూజీ 109వ జయంతి



**భువనగిరి, సెప్టెంబర్ 27(మన న్యూస్) :** తెలంగాణ రాష్ట్ర సాధనకు కృషి చేసిన కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలు మరువలేవని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతు కే. జండగే అన్నారు. శుక్రవారం రోజు కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా వెనుక బడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ 109 వ జయంతి సందర్భంగా కలెక్టర్ అయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ బిసిల అభ్యున్నతి కోసం ఎంతో కృషి చేశారన్నారు. అందరు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీని మార్గదర్శకంగా తీసుకొని ముందుకు వెళ్లాలన్నారు. మహాత్మగాంధీ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు నడిచిన వ్యక్తి కొండా లక్ష్మణ్ బాపూజీ అన్నారు.1942లో క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొనడం జరిగిందన్నారు. 1969 లో తెలంగాణ రాష్ట్రం కోసం తొలి దశ తెలంగాణ ఉద్యమానికి అండగా నిలిచారని అన్నారు. సామాజిక న్యాయం, క్రమశిక్షణ , దీక్ష, దృఢసంకల్పం కలిగిన వ్యక్తి ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ అని అందరికి ఆదర్శనీయులన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గంగాధర్, జిల్లా రెవిన్యూ అదనపు కలెక్టర్ బెన్ షాలోమ్, జిల్లా పరిషత్తు ముఖ్య కార్యనిర్వాహక అధికారి శోభారాణి, జిల్లా వెనుక బడిన తరగతుల సంక్షేమాధికారి యాదయ్య, జిల్లా అధికారులు, వివిధ సంఘాల నాయకులు, బాబు రావు, నర్సింహా, అశోక్, బంటు రామచంద్రయ్య, వెంకటేశం, వైకుంఠం, శ్రీరామ్ సత్యయ్య, ఆంజనేయులు, కలెక్టరేట్ సిబ్బంది, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో యువకులు మృతి

- బైకులు ఎదురెదురుగా ఢీ



**మునుగోడు, సెప్టెంబర్ 27 (మనం న్యూస్) :** మునుగోడు మండల కేంద్రంలోని చోల్లేడు గ్రామానికి పోయే దారిలో మధ్యాహ్నం సమయంలో రెండు బైకులు ఎదురు ఎదురుగా ఢీకొనడంతో అక్కడికక్కడే ఇద్దరు యువకులు మృతి చెందారు ఒకరికి తీవ్ర తీవ్ర గాయాలయ్యాయి. ఎస్ ఐ చందా వెంకటేశ్వర్లు తెలిపిన వివరాలు ప్రకారం మృతి చెందిన వారు మండల కేంద్రానికి చెందిన రేవెల్లి నాగరాజు మర్రిగూడెం మండలం (నర్సిరెడ్డిగూడెం) గ్రామానికి చెందిన కీలు కత్తుల ఆంజనేయులు ఫిలియన్ రైడర్ బొమ్మ గోని నరేష్ గాయపడ్డారు అనంతరం వారిని హాస్పిటల్ కు తరలించారు. ఈ కార్యక్రమంలో. పోలీస్ సిబ్బంది, తదితరులు, పాల్గొన్నారు.

# స్వరాష్ట్ర సాధనలో అలుపెరగని కృషి చేసిన నాయకుడు కొండా లక్ష్మణ్ బాపూజీ

- రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్
- పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ఘనంగా కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి





పెద్దపల్లి,సెప్టెంబర్ 27 (మనం ప్రతినిధి) : స్వరాష్ట్ర సాధనలో ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ అలుపెరుగని కృషి చేశారని రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. స్వాతంత్ర సమరయోధుడు, తొలి మలిదశ తెలంగాణ రాష్ట్ర సాధన పోరాటంలో కీలక భూమిక పోషించిన కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలను రామగుండం పోలీస్ కమిషనరేట్ లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ శ్రీ ఎం. శ్రీనివాస్ కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా సిపి మాట్లాడుతూ. కొండా లక్ష్మణ్ బాపూజీ గారు మహనీయుడని.. మలిదశ తెలంగాణ ఉద్యమానికి తన ఇంటిని, ఆస్తులను దానం చేశారని, స్వాతంత్ర పోరాటం, నిజాం నిరంకుశ వ్యతిరేక ఉద్యమం, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం ఐదు దశాబ్దాలుగా అలుపెరగని కృషి చేశారని, దేశసేవకు అంకితమైన వ్యక్తి కొండాలక్ష్మణ్ బాపూజీ అని కొనియాడారు. కొమరంభీం జిల్లా, వాంకిడి గ్రామంలో 1915 సెప్టెంబర్ 27న జన్మించారు. 1952 ఎన్నికల్లో తొలిసారి ఆసిఫాబాద్ నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికైన కొండా లక్ష్మణ, తర్వాత 1967,1972లో భువనగిరి నుంచి అసెంబ్లీకి ప్రాతినిధ్యం వహించారు. 1957-60 వరకు ఉమ్మడి రాష్ట్రం డిప్యూటీ స్పీకర్‌గా, అనంతరం దామోదరం సంజీవయ్య క్యాబినెట్‌లో ఎక్సైజ్, చేనేత, చిన్నతరహా పరిశ్రమల శాఖ మంత్రిగా, బ్రహ్మానందరెడ్డి మంత్రివర్గంలో కార్మిక, సమాచార శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. 1969 తెలంగాణ తొలి దశ ఉద్యమంలో కీలక భూమిక పోషించారు. తెలంగాణ కోసం ఉద్యమించి, ఉద్యమకారులతో ఇందిరాపార్కు వద్ద సత్యాగ్రహ దీక్ష, ఢిల్లీలో జంతర్‌మంతర్‌లో సత్యాగ్రహం చేయడం ఆయన పోరాట స్ఫూర్తికి నిదర్శనం. ప్రత్యేక రాష్ట్రం ఇవ్వకపోతే సమాంతర ప్రభుత్వం ఏర్పాటు చేస్తామని తేల్చిచెప్పారని వారి జీవితం భవిష్యత్ తరాలకు ఆదర్శం అన్నారు.ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్ర రావు, ఏఆర్ ఏసీపీ ప్రతాప్, ఇన్స్పెక్టర్ లు రవీందర్, అజయ్ బాబు, ఆర్ఐ దామోదర్, మల్లేశం, శ్రీనివాస్, వామన మూర్తి, సంపత్, సూపరింటెండెంట్ ఇంద్ర సేనా రెడ్డి , మనోజ్ కుమార్ , సంధ్య , సీపీఓ సిబ్బంది, వివిధ వింగ్స్ సిబ్బంది, ఏఆర్ సిబ్బంది పాల్గొన్నారు.

## జ్వరాల నియంత్రణకు అవసరమైన పరీక్షలు నిర్వహించాలి

- ఆసుపత్రి అభివృద్ధి సమావేశం నిర్వహించి దుకాణాల అద్దె పెంపునకు ప్రతిపాదనలు సిద్ధం
- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష
- సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిని పరిశీలించి , పని తీరును సమీక్షించిన జిల్లా కలెక్టర్



సుల్తానాబాద్, సెప్టెంబర్ 27 (మనం న్యూస్) : వైరల్ జ్వరాలను నియంత్రించేందుకు ఆసుపత్రికి వచ్చే రోగులను పరిశీలించిన తర్వాత అవసరమైన వారందరికీ వైద్య పరీక్షలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు.శుక్రవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిని పరిశీలించారు. ఆసుపత్రి పని తీరుపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఆస్పత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలు వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, ఆసుపత్రి అభివృద్ధి సమావేశాన్ని నిర్వహించుకోవాలని, ఆసుపత్రి దుకాణాలకు సంబంధించి అద్దె పెంపు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్ సూచించారు. ఆసుపత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ అన్నారు. ఆసుపత్రి పనితీరుపై రివ్యూ నిర్వహించిన కలెక్టర్ ప్రతి అంశానికి సంబంధించిన రిపోర్టు క్షుణ్ణంగా పరిశీలించారు. ఆసుపత్రికి దాదాపు 400 మంది అవుట్ పేషెంట్లు రెగ్యులర్ గా వస్తున్నారని, వీరికి మెరుగైన సేవలు అందిస్తున్నారని తెలిపారు. ఈ సమావేశంలో సుల్తానాబాద్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమాదేవి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదాలు జరుగుతున్నాయి..

- చెట్ల కొమ్మలను తొలగించండి..

వీణవంకసెప్టెంబర్27(మనంన్యూస్): మండలంలోని ఐలాబాద్ గ్రామ ప్రధాన రహదారి నుండి సమీప చల్లూరు గ్రామానికి వెళ్లే మార్గంలో రోడ్డుకు ఇరువైపుల ఉన్న చెట్లు ఏపుగా పెరగడంతో రహదారి పైన వేగంగా వెళ్తున్న ఇసుక లారీల కు దారి ఇవ్వడం వలన వాహనదారులకు వేలాడుతున్న చెట్ల కొమ్మలు తగిలి పలువురు ప్రమాదాల బారిన పడ్డారని జిల్లా రోడ్లు, భవనాలశాఖ అధికారులు స్పందించి సిబ్బందితో వెంటనే వాహనదారులకు అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించాలని ఐలాబాద్ గ్రామస్థులు కోరారు.

# పద్మశాలీల సంక్షేమానికి కృషి



- కార్పొరేషన్ ఏర్పాటుకు సీఎంను కలుస్తా
- తెలంగాణ కోసం మొదటి రాజీనామా కొండా లక్ష్మణ్ బాపూజీదే
- నియోజకవర్గంలోని పద్మశాలీల ప్రాతినిధ్యం ఉన్న గ్రామాలన్నింటిలో సామాజిక భవనాలు నిర్మిస్తాం
- పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు సుల్తానాబాద్ లో ఘనంగా కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు

సుల్తానాబాద్, సెప్టెంబర్ 27 (మనం న్యూస్) : సుల్తానాబాద్ పట్టణంలోని పూసాల రోడ్డులో స్వర్గీయ కొండ లక్ష్మణ్ బాపూజీ 109 వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు హాజరయ్యారు.శ్రీ కొండ లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పెద్దపల్లి నియోజకవర్గంలో పద్మశాలి సామాజిక పవనాలు నిర్మించడానికి నిధులు కేటాయిస్తానని హామీ ఇచ్చారు. సుల్తానాబాద్ పట్టణంతోపాటు పద్మశాలీల జనాభా ప్రాతినిధ్యం ఎక్కువగా ఉండి, భవనాల కోసం భూములు కలిగి ఉన్న సంఘాలకు సామాజిక భవనాలు నిర్మించడానికి నిధులు కేటాయిస్తానని హామీ ఇచ్చారు. శ్రీ కొండా లక్ష్మణ్ బాపూజీ తెలంగాణ కోసం నిబద్ధతతో పనిచేసే తన జీవితాన్ని అంకితం చేశారని కొనియాడారు. అతడిని ఆదర్శంగా తీసుకొని తెలంగాణ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. నాడు తెలంగాణ కోసం మంత్రి పదవిని రాజీనామా చేసి త్యాగం చేసిన మొట్టమొదటి నాయకుడు లక్ష్మణ్ బాపూజీ అని అన్నారు. మొదటగా రాజీనామాలు చేశామని బిఆర్ ఆర్ఎస్ అధినేత కెసిఆర్ అబద్దాలు ప్రచారం చేసుకుంటున్నారని స్పష్టం చేశారు. పద్మశాలీల కోసం కార్పొరేషన్ ఏర్పాటుకు కృషి చేస్తానని అన్నారు. చేనేత సహకార సంఘాల్లో సభ్యులైన వారికే కాకుండా ఈ వృత్తి లో ఇతరత్రా పనులు చేస్తున్న అందరికీ పెన్షన్లు ఇవ్వాలని పలువురు ఎమ్మెల్యేను కోరగా ఆయన సానుకూలంగా స్పందించారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తానని అన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ గాజుల లక్ష్మి రాజమల్లు, జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షుడు వేముల రామ్మూర్తి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఐల రమేష్, జిల్లా ఉపాధ్యక్షుడు సాయిరి మహేందర్, జిల్లా ముఖ్య సలహాదారుడు చీకట్ల మొండయ్య,జిల్లా యువజన సంఘం అధ్యక్షుడు మేరుగు యాదగిరి, మండల సంఘం అధ్యక్షుడు గుండా మురళి, సీనియర్ జర్నలిస్టు సామల హరికృష్ణ,పోపా జిల్లా ప్రధాన కార్యదర్శి సామల రాజేంద్రప్రసాద్, తుమ్మ రాములు,సీనియర్ కాంగ్రెస్ నాయకులు మినుపాల ప్రకాష్ రావు, అంతటి అన్నయ్య గౌడ్, చిలుక సతీష్, వేగోళం అబ్బయ్య గౌడ్, ముస్త్యాల రవీందర్, కుమార్ కిషోర్, పద్మశాలి సంఘం నాయకులు ఆడెపు అంబ దాసు, కామని వెంకటరమణ, ఎలిగేటి రమేష్,గాదాసు రవి, పెగడ పరశురాములు, కొండ సత్తయ్య, దూడం ఆంజనేయులు, దూడం లింగమూర్తి, సామల రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ టియూఎఫ్ఐడిసి పనులు త్వరగా పూర్తి చేయాలి

- అనుమతులు లేకుండా మున్సిపాలిటీలో ఎక్కడా నిర్మాణాలు చేపట్టవద్దు
- మున్సిపల్ ఆదాయం పెంపుదలకు ప్రణాళిక బద్ధంగా చర్యలు
- పెద్దపల్లి మున్సిపల్ అభివృద్ధి పై సమీక్షించి, అనంతరం క్షేత్రస్థాయిలో పనులను పర్యవేక్షించిన జిల్లా కలెక్టర్



పెద్దపల్లి, సెప్టెంబర్ 27(మనం ప్రతినిధి) : పెద్దపల్లి మున్సిపాలిటీలో తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ ఇన్స్టిట్యూషన్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు.శుక్రవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లో పెద్దపల్లి మున్సిపాలిటీ పై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, పెద్దపల్లి పట్టణంలో పెండింగ్ ఉన్నటువంటి టి.యు.ఎఫ్.ఐ.డీ.సీ పనులు త్వరగా పూర్తి చేయాలని అన్నారు. పట్టణంలో అనుమతులు లేకుండా ఎలాంటి నిర్మాణాలు చేపట్ట రాదని, అక్రమ నిర్మాణాలను వెంటనే తొలగించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు పెద్దపల్లి మున్సిపాలిటీలో ప్రజలు ఇంటి పనులు సకాలంలో చెల్లించే చర్యలు తీసుకోవాలని, అలాగే కమర్షియల్ దుకాణాలను గుర్తించి, వాటి ప్రాపర్టీ టాక్స్ రివిజన్ చేసి టాక్స్ పెంపుదల ప్రక్రియ రెండు నెలల్లో పూర్తి చేయాలని కలెక్టర్ తెలిపారు.పట్టణంలోని దుకాణ యజమానులు ప్రతి ఒక్కరు ట్రేడ్ లైసెన్స్ కలిగి ఉండాలని, మున్సిపల్ ఆదాయం పెంపుదలకు దృష్టి సారించి ప్రణాళిక బద్ధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రతి వార్డుల్లో పారిశుధ్య నిర్వహణ పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని అన్నారు. పట్టణంలో నర్సరీల పై ప్రత్యేక దృష్టి సారించాలని, పట్టణంలో నాటిన మొక్కల సంరక్షణకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులకు తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ గౌరెడ్డి పెట్ దగ్గరలోని మున్సిపల్ డంపింగ్ యార్డ్, వ్యవసాయ మార్కెట్ లోని నిర్మాణంలో ఉన్న వెజ్ నాన్ వెజ్ మోడ్రన్ మార్కెట్ , ఎస్సీ బాలికల హాస్టల్ లో జరుగుతున్న అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు .ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్, ఏఈ టి.పి.ఎస్. వినయ్, మున్సిపల్ సిబ్బంది, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యేక తెలంగాణ కోసం మొదటి రాజీనామా చేసిందే కొండా లక్ష్మణ్ బాపూజీ



- పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు
- ఘనంగాకొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు

పెద్దపల్లి,సెప్టెంబరు 27 (మనం ప్రతినిధి) : ప్రత్యేక తెలంగాణ కోసం మొట్టమొదటిసారిగా రాజీనామా చేసిందే ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ అని పెద్దపల్లి ఎమ్మెల్యే విజయ రమణారావు పేర్కొన్నారు. ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ 109 వ జయంతిని పురస్కరించుకొని శుక్రవారం రోజున పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన జయంతి వేడుకల్లో పెద్దపెల్లి ఎమ్మెల్యే విజయరమణారావు ముఖ్య అతిథిగా పాల్గొని జిల్లా అధికారులతో మరియు నాయకులతో కలిసి కొండా లక్ష్మణ్ బాపుజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయరమణ రావు మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోదుడు తెలంగాణ ఉద్యమకారుడు, బలహీన వర్గాల సంక్షేమం కోసం పాటుపడిన శ్రీ కొండ లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా వారికి ఘనంగా నివాళులర్పింస్తున్నమనిఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ తెలంగాణ కోసం నిబద్ధతతో పనిచేసి తన జీవితాన్ని అంకితం చేశారని కొనియాడారు. అతడిని ఆదర్శంగా తీసుకొని తెలంగాణ అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. నాడు తెలంగాణ కోసం మంత్రి పదవి కి రాజీనామా చేసి త్యాగం చేసిన మొట్టమొదటి నాయకుడు లక్ష్మణ్ బాపూజీ అని అన్నారు. అలాగే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత తొలిసారిగా మన ప్రభుత్వ హయంలో కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు అధికారికంగా నిర్వహిస్తున్నామని ఈ సందర్భంగా తెలియజేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు జిల్లా పద్మశాలి సంఘం నాయకులు కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు మరియు తదితరులు పాల్గొన్నారు.

## 29న మాల ఆత్మగౌరవ సదస్సు విజయవంతం చేయాలి

- మాల ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు బుద్ధం డానియల్ సదస్సు పోస్టర్లు ఆవిష్కరణ

పెద్దపల్లి, సెప్టెంబర్ 27(మనం ప్రతినిధి) : ఈనెల 29న ఎన్టీపీసీ లక్ష్మీ నరసింహ గార్డెన్‌లో మాల కుల బంధువులు, ఉద్యోగుల ఆత్మగౌరవ సభను ఏర్పాటు చేసినట్లు తెలంగాణ మాల ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు బుద్దం డానియల్, ప్రధాన కార్యదర్శి దాసరి రాజు తెలిపారు. పెద్దపల్లి ప్రెస్ క్లబ్ లో శుక్రవారం సదస్సు పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం మీడియా సమావేశంలో మాట్లాడుతూ మాల కుల బంధువులు, ఉద్యోగులు రాజకీయాలకు అతీతంగా పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. సదస్సుల్లో వివిధ డిమాండ్లపై చర్చించి తదుపరి కార్యాచరణ ప్రకటించనున్నట్లు పేర్కొన్నారు. సదస్సుకు పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీ, ఎమ్మెల్యేలు గడ్డం వివేక్, కె ఆర్ నాగరాజు, మేడిపల్లి సత్యం, మాల వర్గానికి చెందిన ప్రముఖులు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు కాసర్ల వెంకటస్వామి, కూడె అంజయ్య, సంయుక్త కార్యదర్శి ముడుసు లక్ష్మన్, కోశాధికారి కోడి సంజీవ్ రావు, కనుమల్ల కొమురయ్య, దుస్స అశోక్ కుమార్, పండుగ భాను తేజ, గుడిసెల భీంసేన్, తదితరులు పాల్గొన్నారు.

## అధికారులు చర్యలు చేపట్టాలి



వీణవంక-సెప్టెంబర్27(మనంన్యూస్): ప్రధాన రహదారులపై చాలామంది తమ వాహనాలను ఇష్టం వచ్చిన చోట నిలుపుతుండటం వలన రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి.ప్రమాదాలలో ఎంతోమంది గాయాలపాలవుతున్నారు.మరికొందరు మృత్యువాత పడుతున్నారు.నిర్దేశిత స్థలంలోనే వాహనాలను నిలిపేలా అధికారులు చర్యలు తీసు కొని ప్రమాదాలకు అడ్డుకట్టవేయాలని పలువురు కోరుతున్నారు.

## పంచాయతీ కార్యదర్శుల సమస్యలు పరిష్కరించాలని వినతి

- పంచాయతీ ఆర్థిక సమస్యల పరిష్కారం కొరకు ప్రత్యేక గ్రాంట్ రిలీజ్ చేయాలి



అనంతగిరి,సెప్టెంబర్ 27(మనం న్యూస్) : పంచాయతీ కార్యదర్శుల ఆర్థిక సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సూర్యాపేట జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో శిరీష అనంతగిరి మండల అభివృద్ధి అధికారి షేక్ సుష్మకు వినతి పత్రాన్ని అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ సర్పంచుల పదవీ కాలం పూర్తయినట్టుండి పూర్తి ఆర్థిక భారాన్ని కార్యదర్శులమే భరిస్తున్నామని గ్రామ పంచాయతీలకు ప్రభుత్వం ఎటువంటి నిధులు సమకూర్చకుండా గ్రామాల్లో ఏ సమస్య వచ్చినా ఏ పని చేసిన మా జేబులోనుండే ప్రతి పైసా ఖర్చు పెడుతున్నామని మా ఆర్థిక పరిస్థితులు అర్థం చేసుకునే వారే కరువయ్యారని గ్రామ పంచాయతీలో వచ్చే అరకొర వాటితో ట్రాక్టర్ ఇఎంఐలు డీజిల్ కొరకు అదేవిధంగా గతంలో పనులు చేసినటువంటి సర్పంచులు కూడా పైసలు చెల్లించాలని మా పై ఒత్తిడి తెస్తున్నారని గ్రామాల్లో ప్రభుత్వం వారు ఏదైనా ఆదేశాలు ఇస్తే మౌఖికంగా మాత్రమే ఇస్తున్నారని అంగన్వాడీలు ఆశ వర్కర్లు పూర్తి సహకారం అందించడం లేదని వారికి శాఖ పరమైనటువంటి ఆదేశాలు జారీ చేసినట్లయితే వారు మాకు పూర్తిగా సహకరిస్తారని అన్నారు. గ్రామపంచాయతీ సమస్యలు తొలగాలంటే ప్రత్యేక గ్రాండ్ రిలీజ్ చేసి ఆర్థిక ఇబ్బందులు తొలగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండలంలో పనిచేస్తున్న గ్రామాల కార్యదర్శులు పాల్గొన్నారు.

## దీర్ఘకాలిక రుణాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

- మంత్రి సహకారంతో సంఘం అభివృద్ధి
- పిఎసిఎస్ చైర్మన్ జుట్టుకొండ సత్యనారాయణ



గరిడేపల్లి,సెప్టెంబర్ 27(మనం న్యూస్) : ప్రభుత్వం అందిస్తున్న దీర్ఘకాలిక రుణాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని రాయినిగూడెం పిఎసిఎస్ చైర్మన్ జుట్టుకొండ సత్యనారాయణ అన్నారు.శుక్రవారం మండల పరిధిలోని కీతవారిగూడెం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో నిర్వహించిన జనరల్ బాడీ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ....రైతులకు అందిస్తున్న టాక్టర్లు,గేదెలు,కోళ్ల ఫారంలు,జీవాలు తదితర వాటిపై ఇచ్చే ఎల్ టి లోన్లను ఒక ఎకరంనర పైగా ఉన్న ప్రతి రైతు లోన్లను సద్వినియోగం చేసుకోవచ్చని ఆయన తెలిపారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సహకారంతో సంఘం అభివృద్ధిలో కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు.రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అవసరమైన వ్యవసాయ అవసరాలకు సంబంధించిన విత్తనాలు ఎరువులు సరైన సమయంలో సక్రమంగా రైతులకు అందిస్తున్నట్లు ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో సీఈఓ నిడిగొండ కనకయ్య,డైరెక్టర్లు చనగాని సాంబయ్య, కడప రజిత,బొల్లెపల్లి రామనాథం,పోటు నాగేశ్వరరావు, మంగళగిరి కృష్ణ,మాజీ ఎంపిటిసి ఎస్.కె మున్నిషా బేగం చాందిమియా, రైతులు బాల్దూరి అంజయ్య,సురేష్,సోమయ్య,అంజయ్య,పలువురు రైతులతో పాటు సంఘం సిబ్బంది పాల్గొన్నారు.

## ఇన్నర్ విల్ క్లబ్ ఆధ్వర్యంలో సామూహిక సీమంతాలు

భువనగిరి, సెప్టెంబర్ 27 (మనం న్యూస్) : భువనగిరి పట్టణంలోని ఇన్నర్ వీల్ క్లబ్ ఆధ్వర్యంలో చొల్లేరు గ్రామం నందు సామూహిక శ్రీమంతాల కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 16 మంది గర్భిణీ స్త్రీలకు శ్రీమంతం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ సి వెంకమ్మ మరియు ఫాస్ట్ ప్రెసిడెంట్ లావణ్య పాల్గొన్నారు. స్థానిక అంగన్వాడి సెంటర్ నందు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సామూహిక సీమంతాల కార్యక్రమానికి చొల్లేరు గ్రామ మరియు పరిసర ప్రాంతాలకు సంబంధించిన అంగన్వాడి టీచర్లు మరియు సూపర్వైజర్, గ్రామ మాజీ సర్పంచ్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అక్కడికి వచ్చిన గర్భిణీ స్త్రీలకు ప్రెగ్నెన్సీ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు మరియు ఏ విధమైన ఆహారం తీసుకోవాలి అనే విషయాలను గురించి వారికి క్షుణ్ణంగా వివరించారు. తదనంతరం వారికి పోషకాహారాన్ని అందించారు.

# నిస్వార్థ సేవకుడు కొండా లక్ష్మణ్ బాపూజీ

**హుస్నాబాద్, సెప్టెంబర్ 27(మనం న్యూస్):** తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం పరితపించిన నిస్వార్థ సేవకుడు కొండా లక్ష్మణ్ బాపూజీ అని పలువురు తెలిపారు. పట్టణ కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి వేడుకలను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆనంతరం పలువురు మీడియాతో మాట్లాడుతూ నిబద్ధత, నిజాయితీ కలిగిన ఇలాంటి నాయకులు ఉండటం చాలా అరుదు అన్నారు. తెలంగాణ ఉద్యమ పితామహుడు కొండ లక్ష్మణ్ బాపూజీ ఆశయ సాధనకు కృషి చేయాలని పలువురు పిలుపునిచ్చారు. త్వరలోనే హుస్నాబాద్‌లో



కొండ లక్ష్మణ్ బాపూజీ విగ్రహాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ తన స్వంత ఖర్చులతో ఏర్పాటు చేయనున్నట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, టిపిసిసి మెంబర్ కేడం లింగమూర్తి, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, మేకల వీరన్నయాదవ్, కోయడ కొమురయ్య, వేణుగోపాల్, కోమటి సత్యనారాయణ, వద్దేపల్లి వెంకటరమణ, గాజుల భగవాన్, కొండ సతీష్, వద్దేపల్లి బాలయ్య, వద్దేపల్లి లక్ష్మణ్, బూర్ల సత్యం, వద్దేపల్లి మల్లేశం, వద్దేపల్లి రాజేశం, చిప్ప ప్రభాకర్, వెల్దండి వెంకటనారాయణ, నాగభూషణం, వద్దేపల్లి అరుణ, సంగ కుమాం, తదితరులున్నారు.

## దేశం కోసం పని చేయడం గర్వకారణం

• కలెక్టర్ రాహుల్ శర్మ




**భూపాలపల్లి,సెప్టెంబర్ 27(మనం న్యూస్) :** దేశం కోసం పని చేయడం ఎంతో గర్వకారణమని కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు.శుక్రవారం ఐడిఓసి కార్యాలయపు సమావేశపు హాలులో ఉపాధి, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అగ్నిపత్ పథకం లోని అగ్ని వీర్ వాయు కార్యక్రమం గురించి విద్యార్థులకు, యువతి యువకులకు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దేశం కోసం పనిచేయడం చాలా గర్వకారణమైన విషయమని జిల్లా నుండి ఆర్మీ, నేవీ, ఏవియేషన్ లో చేరి దేశానికి సేవ చేయాలని తద్వారా తల్లిదండ్రులకు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని తెలిపారు.17 నుండి 21 సంవత్సరాల లోపు యువత అగ్నిపత్ కు ఎంపిక చేయడం జరుగుతుందని అన్నారు. విద్యార్థులకు యువతకు అవగాహన కల్పించడానికి హైదరాబాద్ ఇండియన్ ఎయిర్ ఫోర్స్ అధికారులు క్లుప్తంగా తెలియజేయడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థి, యువత దేశ సేవకు ముందుకు అడుగు వేయడానికి చక్కని సమయమని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల ఆదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డీఈవో రాజేందర్, ఉపాధి కల్పన అధికారి శ్యామల, అగ్నిపత్ శిక్షకులు సందీప్, యువత, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాలు క్షేత్రస్థాయిలో తెలవాలి



**భూపాలపల్లి,సెప్టెంబర్ 27(మనం న్యూస్) :** ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు, ప్రభుత్వ ఆలోచనలు క్షేత్రస్థాయిలో ప్రజలకు తెలిసేలా విస్తృతంగా కళా ప్రదర్శనలు చేపట్టాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో సమాచార పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో ఉన్న తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులతో ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు పై కళాప్రదర్శనలు నిర్వహణపై సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయుటకు కళాకారులు ఆటా, పాటల ద్వారా తెలియచేయాలని అన్నారు. కీలకమైనదని ఎమ్మెల్యే గంట సత్యనారాయణ రావు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలలోకి తీసుకువెళ్లేందుకు కళాకారుల పాత్ర ముఖ్యమైనదని అన్నారు. ప్రతిరోజు క్రమం తప్పకుండా గ్రామాలలో పర్యటిస్తూ ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేయాలని సూచించారు. కళాకారులకు సంబంధించి ఏదైనా సమస్య ఉంటే తన దృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు. మీ కళారూపాలు ప్రజల్లో చైతన్యం నింపాలని తెలిపారు. ప్రభుత్వం ప్రజల ఆశయాలను నెరవేర్చేందుకు అహర్నిశలు కృషి చేస్తున్నదని ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై రచనలు, నాటికలు, పాటలు ద్వారా ప్రజలకు తెలిసేలా కళా ప్రదర్శనలు చేయాలని ఆదేశించారు. మేరవేర్చినందుకుఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల కలెక్టర్, విజయలక్ష్మి, జిల్లా పౌరసంబంధాల అధికారి శ్రీనివాస్, కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ విద్య బలోపేతానికై కృషి చేస్తా



**మల్హర్,సెప్టెంబర్ 27(మనం న్యూస్) :** మండలంలో ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత విద్యా బలోపేతానికి ఉపాధ్యాయులతో కలిసి కృషి చేస్తామని మల్హర్ రావు మండల నూతన విద్యాధికారి లక్ష్మణ్ బాబు తెలిపారు . మండల విద్యాధికారిగా నూతనంగా బాధ్యతలు తీసుకున్న తరువాత ఆయన మండల వనరుల కేంద్రంలో మాట్లాడుతూ నాస్ ఎల్ ఈ పి, ఎల్ ఐ పి లాంటి కార్యక్రమాల విజయవంతానికి ఉపాధ్యాయులందరు కృషి చేయాలని లక్షణ్ బాబు అన్నారు ఈ సందర్భంగా మండలం లోని వివిధ హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు భాస్కర రావు సుదర్శన్ తిరుపతి ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఎంఇఓ ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘ నాయకులు రమేష్ నాయక్ సదానందం అరుణ్ కుమార్ తిరుపతి రెడ్డి ,మహేందర్,మహేష్ ,రామన్న సుధాకర్ ,వెంకటేశ్వర్లు ,మహిపాల్ సంపత్ చంద్రశేఖర్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కాలనీల్లో విద్యుత్ సమస్య తీర్చండి

**మహాదేవపూర్, సెప్టెంబర్ 27(మనం న్యూస్) :** మండల కేంద్రంలోని డబుల్ బెదురూమ్ ఇండ్లలో నెలకొన్న విద్యుత్ సమస్య ను తీర్చాలని ఎమ్మార్పిఎస్ అధ్యక్షుడు బెల్లంపల్లి సురేష్ ఒక ప్రకటనలో కోరారు. మండల కేంద్రానికి కూత వేటు దూరంలో ఉన్న డబుల్ బెడ్ రూమ్. ఎస్సి ఎస్టీ కాలనీలకు నిత్యం వేళా పాల లేని కరెంట్ కోటలతో ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.కాలనిలో విద్యుత్ సమస్య పై ఆశాఖ అధికారులకు పలు మార్లు చెప్పిన పట్టించుకోవడం లేదని అన్నారు. కరెంట్ కష్టాలు తీర్చాల్సిన బాధ్యత అధికారులపై ఉందని మహాదేవపూర్ లైన్ కు విద్యుత్ సరఫరా కనెక్ట్ చేసి కాలనీ వాసుల విద్యుత్ సమస్య తీర్చాలని లేకుంటే విద్యుత్ కార్యాలయం ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు.

# నిత్యావసర వస్తువుల ధరలను తగ్గించాలి



• సిపిఐ నాయకుల ధర్నా

**హుస్నాబాద్,సెప్టెంబర్ 27 (మనం న్యూస్):** నిత్యావసర ధరలను వెంటనే తగ్గించాలని సిపిఐ నాయకులు డిమాండ్ చేసారు. పట్టణ కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో శుక్రవారం నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలకు నిరసనగా సిపిఐ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు గడిపే మల్లేష్ మాట్లాడుతూ పేదలకు అనేక హామీలిచ్చి రెండవ సారి అధికారంలోకి వచ్చిన కేంద్రంలోని బీజేపీ సర్కార్ కార్పొరేట్ సంస్థల రుణాలను మాఫీ చేస్తూ మరో వైపు నిత్యావసర వస్తువుల ధరలను పెంచుతూ పేద ప్రజల నడ్డీ విరుస్తోందని మండిపడ్డారు. రాష్ట్రంలో నిత్యావసర వస్తువులు సరిపడ నిలువ ఉన్నా కొరతను సృష్టించి ధరలను పెంచుతున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేసారు. వెంటనే కేంద్ర ప్రభుత్వం నిత్యావసర ధరలను తగ్గించాలని, లేని యెడల సిపిఐ ఆధ్వర్యంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు అయిలేని సంజీవరెడ్డి, పిట్టల బాలయ్య, ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు జనగాం రాజుకుమార్, సిపిఐ మండల నాయకులు పొదిల కుమారస్వామి, పిట్టల ప్రసాద్, ఎం.డీ.అక్బర్, అయిలేని మలారెడ్డి, మౌటం బాలయ్య, చెప్యాల సమ్మయ్య, బింగి సమ్మయ్య, పొదిల కనకస్వామి, వంగపల్లి వెంకటయ్య, కాల్వల ఎల్లయ్య, భారత జాతీయ మహిళా సమాఖ్య జిల్లా నాయకురాలు జంగ విజయ, దొంతరవేని రజిత, ఇల్లందుల సత్యవతి, దొంతరబోయిన అనిత, ముక్కెర వెంకటలక్ష్మి, మర్యాల సులోచన, అందే భవాని, తదితరులున్నారు.

# మానవ తప్పిదాలతోనే సైబర్ నేరాలు

• ప్రజలు మూఢ నమ్మకాలను వీడాలి

• అక్కన్నపేట ఎస్.ఐ.విజయ్ భాస్కర్

**అక్కన్నపేట, సెప్టెంబర్ 27 (మనం న్యూస్) :** మానవ తప్పిదాలతోనే సైబర్ నేరాలు జరుగుతున్నాయని అక్కన్నపేట ఎస్.ఐ.విజయ్ భాస్కర్ అన్నారు. మండలంలోని కట్కూర్ గ్రామంలో పోలీస్ కమీషనర్ డా.అనురాధ ఆదేశానుసారం పోలీస్ కళాబృందంచే కనువిప్పు కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్.ఐ.విజయ్ భాస్కర్ హాజరైనారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు మూఢ నమ్మకాలు వీడాలని సూచించారు. యువత, మహిళలు వారికి ఉన్న చట్టాలు, సైబర్ నేరాలు, బాల్య వివాహాలు, సామాజిక మాధ్యమాలు వాటి ప్రభావం, సైబర్ సెక్యూరిటీ, మైనర్ డ్రైవింగ్, మహిళా రక్షణ, సెల్ఫ్ డిఫెన్స్, విద్యార్థి చట్టాలు, గుడ్‌టచ్ అండ్ బ్యాడ్ టచ్, ఈవ్‌టీజింగ్ పై పలు సూచనలు చేసారు. మహిళలకు, యువతకు ఏ కష్టం వచ్చినా వెంటనే షీ-టీమ్, లేదంటే డయల్ 100 కి కాల్ చేయాలన్నారు. అపరిచిత



వ్యక్తుల పట్ల జాగ్రత్తగా ఉండాలని, గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేస్తే వారికి స్పందించవద్దు అన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ కళాబృందం సభ్యులు, తదితరులున్నారు.

# ప్రతి ఉద్యోగికి బదిలీ తప్పనిసరి



• జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కలకొండ రవీందర్ రెడ్డి

**కోహెడ, సెప్టెంబర్ 27 (మనం న్యూస్) :** ప్రతి ఉద్యోగికి బదిలీ తప్పనిసరి అని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కలకొండ రవీందర్ రెడ్డి అన్నారు. మండల కేంద్ర ంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్‌గా పని చేస్తున్న గుర్రం రవీందర్‌రెడ్డి బదిలీపై వెళ్తున్నారు. ఈ సందర్భంగా ఆత్మీయ వీడ్కోలు సమావేశాన్ని శుక్రవారం ఏర్పాటు చేసారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధి కారి కలకొండ రవీందర్ రెడ్డి హాజరైనారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఉద్యోగికి బదిలీ తప్పనిసరి అని అన్నారు. వారు అందించిన సేవలు అమోఘం అన్నా రు. కోహెడ ప్రభుత్వ కళాశాలకు జిల్లాలోనే మంచి పేరు తీసుకువచ్చారని కొనియా డారు. ఆనంతరం గుర్రం రవీందర్‌రెడ్డికి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు రాజేశ్వర్ రెడ్డి, యాదగిరి, రాజమౌళి, వెంకటరెడ్డి, నీర జ, రజిత, శ్రీనివాస్, సీతారామయ్య, నరేష్, అశోక్, సుజాత, విద్యార్థిని, విద్యార్థులు, తదితరులున్నారు.

# కొండా లక్ష్మణ్ బాపూజీ జీవితం ఆదర్శం

**భూపాలపల్లి,సెప్టెంబర్ 27(మనం న్యూస్) :** ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజికి గొప్ప చరిత్ర ఉందని నిస్వార్థపరుడు నిజాయితీపరుడని , ఆయన జీవితం నేటి తరానితో పాటు రాజకీయ నాయకులకు ఆదర్శం కావాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. శుక్రవారం ఐడిఓసి కార్యాలయం లో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ 109వ జయంతి వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, వివిధ కుల సంగాల నాయకులతో కలిసి ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 1952లో తొలిసారిగా శాసనసభ్యులుగా ఎన్నికై సుమారు ఐదు సార్లు శాసనసభ్యులుగా, మంత్రిగా ఉండి తెలంగాణ ప్రజల మనోభాలకు అనుగుణంగా ఢిల్లీలో ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రజల ఆకాంక్ష మేరకు ప్రత్యేక రాష్ట్రాన్ని ఏర్పాటు చేయాలని 1969లో మంత్రి పదవిని తృణపాయంగా వదిలేసిన నిబద్ధత కలిగిన రాజకీయ వేత్త అని తెలంగాణ ఉద్యమాల్లో చురుకుగా పాల్గొన్నారని అన్నారు. రాష్ట్ర ఏర్పాటు కోసం పదవులు అవసరం లేదని మంత్రి పదవిని కూడా లెక్కచేయకుండా నిస్వార్థంగా రాజీనామా చేసి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కొరకు కృషి చేసిన గొప్ప మహనీయుడు కొండా లక్ష్మణ్ బాపూజి అని తెలిపారు. కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాలను సిద్ధాంతాల కొరకు మనందరం కృషి చేయాలని అన్నారు. ఆ మహనీయుని జయంతిని అధికారికంగా నిర్వహించుటకు ఉత్తర్వులు జారీ చేసిన ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు. కొండా లక్ష్మణ్ బాపూజిని ఆదర్శంగా తీసుకుని ప్రజల సంక్షేమం కోసం కృషి చేస్తున్నట్లు తెలిపారు. కొండా లక్ష్మణ్ బాపూజిని విద్యార్థులు ఆదర్శంగా తీసుకుని పట్టుదలతో సైంటిస్టులు, కలెక్టర్లు, ఎస్పీలు ఉపాధ్యాయులు, సాఫ్ట్ వేర్ ఇంజనీరులు, ప్రజాసేవకులుగాను, లాయర్లు కావాలని ఆకాంక్షించారు. కొండా లక్ష్మణ్ బాపూజీ ఏ పట్టుదలతో పోరాడారో ఆయన ఆశయాలు సాధనకు పట్టుదలతో మీ తల్లిదండ్రులు మీద పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ముచేయక కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని అన్నారు. ఈ నియోజకవర్గ ప్రజలు నాకు శాసనసభ్యునిగా అవకాశం ఇచ్చారని, ఈ నియోజకవర్గ ప్రజల



ఆకాంక్ష మేరకు రానున్న సంవత్సరాలలో నిరంతరాయంగా పనిచేసి నియోజకవర్గ నియోజకవర్గ ప్రజల మనోభావాలకు అనుగుణంగా ప్రజా సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. పేదవాని కష్టాలను పరిష్కరిం చేందుకు మీ సేవకునిగా పనిచేస్తానని ఆయన పేర్కొన్నారు. అవినీతికి, అక్రమాలకు, గుండాయిజానికి తావు లేకుండా నియోజకవర్గ ప్రజలను కాపాడే విధంగా మీరు ఇచ్చిన గౌరవాన్ని పెంచుకునే విధంగా కొండా లక్ష్మణ్ బాపూజీని ఆదర్శంగా తీసుకొని విధులు నిర్వహిస్తానని పేర్కొన్నారు. నియోజకవర్గం అభివృద్ధికి నిరంతర కృషి చేస్తానని ప్రజల సహకారంతో అభివృద్ధిని ముందుకు నడిపిస్తానని తెలిపారు. మహనీయుని వర్ధంతిని ఇంత ఘనంగా నిర్వహించుటకు ఉత్తర్వులు జారీ చేసిన ముఖ్యమంత్రితో మాట్లాడి కొండా లక్ష్మణ్ బాపూజి విగ్రహాన్ని జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసే విధంగా కృషి చేస్తానని ఆయ న తెలిపారు.జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ ఆచార్య కొండ లక్ష్మణ్ బాపూజీ ఆదర్శప్రాయుడని అన్నారు. తెలంగాణ ఆత్మగౌరవ పోరాటంలో ఆయన పాత్ర చాలా కీలకమని, స్వయంపాలన కోసం చేసిన ఆయన చేసిన పోరాటాలు చారిత్రాత్మకమైనవని కొనియాడారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన మహనీయుని ఆశయాలు తరతరాలకు ఆదర్శమని కలెక్టర్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి శైలజ, డిపిఆర్వో శ్రీనివాస్, అన్నిశాఖల జిల్లా అధికారులు, వివిధ కుల సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## 30న సింగిల్ విండో సమావేశం

**మహాదేవపూర్,సెప్టెంబర్ 27(మనం న్యూస్) :** మహాదేవపూర్ ప్రాథమిక వ్యవసాయసహకార సంఘం సర్వసభ్య సమావేశం ఈ నెల 30న నిర్వహిస్తున్నట్లు సంఘం ముఖ్య కార్యనిర్వాహన అధికారి రాజబాబు తెలిపారు. ఈ సర్వసభ్య సమావేశం సోమవారం ఉదయం 11గంటలకు జరుగుతుందని సంఘం నగదు విలువ పెంచడం జి.ఓ, 44ప్రకారం సంఘం ఉద్యోగుల సర్వీస్ నిబంధనల ఆమోదం. 2023-24సంఘం లావాదేవీలపై చర్చ అడిట్ నివేదిక ఆమోదం, ఇతర అంశాలు అధ్యక్షుని అనుమతితో జరుగుతుందని కావున సహకాలంలో సభ్యులు, రైతులు హాజరు కావాలని సి ఈ ఓ రాజబాబు కోరారు.

## డిజెఎఫ్ జిల్లా అధ్యక్షుడిగా పొన్నాల రవీందర్




**హుస్నాబాద్, సెప్టెంబర్ 27 (మనం న్యూస్):** డిజెఎఫ్ జిల్లా అధ్యక్షుడిగా పొన్నాల రవీంధర్ ఎన్నికైనట్లు ఆయన ఒక ప్రకటనలో తెలి పారు. డిజెఎఫ్ తెలంగాణ వర్కింగ్ ప్రెసిడెంట్ కోల శ్రీనివాస్, రాష్ట్ర క్రమ శిక్షణా కమిటీ చైర్మన్ మల్లయ్య మహర్షి, జేపీఎఫ్ రాష్ట్ర కన్వీనర్ చింతకింది సింగర య్యల అధ్యక్షతన డిజెఎఫ్ సిద్దిపేట జిల్లా నూతన కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. కోహెడ మండలం కూరేళ్ల గ్రామానికి చెందిన పొన్నాల రవీందర్‌ను డిజెఎఫ్ జిల్లా అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తనపై నమ్మకం ఉంచి జిల్లా అధ్యక్షుడిగా నియమించిన డిజెఎఫ్ జాతీయ, రాష్ట్ర నాయకులకు తన ఏకగ్రీవ ఎన్నికకు సహకరించిన డిజెఎఫ్ సభ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలియజేసారు.

## అంగన్‌వాడీ కేంద్రంలో గ్రోత్ మేళా




**చిట్యాల,సెప్టెంబర్ 27(మనం న్యూస్) :** పోషణ మాసోత్సవాలలో భాగంగా మండలంలోని గిద్దె ముతారం అంగన్వాడీ కేంద్రంలో శుక్రవారం గ్రోత్ మేళా కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమంలో భాగంగా చిన్నారుల ఎత్తు బరువులను సరి చూశారు . పోషణ మాసం ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డా. మౌనిక సూపర్వైజర్ జయప్రద హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ జయప్రద మాటాడుతూ బాలింతలు గర్భిణులు పిల్లలు సమతుల్యమైన ఆహారం తీసుకొని ఆరోగ్యంగా ఉండాలని తెలిపారు.

## శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపట్టాలి



**భూపాలపల్లి, సెప్టెంబర్ 27 (మనం న్యూస్) :** అటవీ, రెవెన్యూ శాఖల మధ్య నెలకొన్న భూ సమస్య శాశ్వత పరిష్కారానికి చర్య లు చేపట్టాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. శుక్రవారం ఐడిఓసి కార్యాలయంలో అటవీ, రెవెన్యూ భూ సమస్యలపై రెవెన్యూ, అటవీ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భవిష్యత్తులో ఇలాంటి సమస్యలు తలెత్తకుండా శాశ్వత పరిష్కారానికి కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. కాటారం మండలం పోచంపల్లిలోని సర్వే నంబర్ 1లో 660 ఎకరాల భూ సమస్య ఉందని, పరిష్కరించడానికి కాటారం సబ్ కలెక్టర్, అటవీశాఖ అధికారులు సంయుక్త పరిశీలన చేయాలని సూచించారు. అలాగే జిల్లాలో ఉన్న రెవెన్యూ, అటవీ సమస్యలు పరిష్కారానికి గెజిట్ ప్రకారం పక్కా సర్వే నిర్వహించాలని తెలిపారు. ఈ సమావేశంలో డిఎఫ్ఓ వసంత, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, ఆర్డీఓ మంగిలాల్, తహసీల్దార్లు, ఎఫ్ఆర్ఓలు తదితరులు పాల్గొన్నారు.




## మూఢనమ్మకంతో బాలుడిని బలిచ్చారు!

**యూపీలో ఓ ప్రైవేటు స్కూల్లో దుర్మార్గం**
**హాస్టల్ నుంచి కిడ్నాప్.. బడి వద్ద హత్య**
**స్కూలు బాగా నడవాలని ఈ దుశ్చర్య**
**యజమాని, డైరెక్టర్, ప్రిన్సిపల్, ఇద్దరు ఉపాధ్యాయుల అరెస్టు**

**ఆగ్రా, సెప్టెంబరు 27:** తమ స్కూలు అడ్మిషన్లతో కళకళలాడాలని ఆ బడిలో రెండో తరగతి చదువుతున్న విద్యార్థిని బలిచ్చారు ఓ ప్రైవేటు పాఠశాల యజమానులు. యూపీలోని హత్రాస్లో ఈ ఘోరం వెలుగుచూసింది. డీఎల్ పబ్లిక్ స్కూల్ ఓనర్ జశోధన్ సింగ్‌కు తాంత్రిక పూజలపై విశ్వాసం మెండు. బడి విజయవంతంగా నడిచేందుకుగాను ఓ పిల్లాడిని బలివ్వాలని స్కూల్ డైరెక్టర్ అయిన తన కుమారుడు దినేశ్ భాగెల్‌కు సూచించగా సరేనన్నాడు. ఈ మేరకు జశోధన్, దినేశ్తో పాటు ప్రిన్సిపల్ లక్ష్మణ్ సింగ్ మరో ఇద్దరు ఉపాధ్యాయులు కలిసి సెప్టెంబరు 23న హాస్టల్లో నిద్రిస్తున్న కృతార్థ్ (11) అనే బాలుడిని అపహరించారు. తాంత్రిక పూజల కోసం బడి ప్రాంగణంలోకి తీసుకెళ్లగా అక్కడ నిద్రలేచిన బాలుడు బిగ్గరగా ఏడుస్తుండటంతో గొంతు నులిమి చంపారు. తర్వాత బాలుడు తీవ్ర అస్వస్థతకు గురయ్యాడని, ఆస్పత్రికి తీసుకెళుతున్నామంటూ తల్లిదండ్రులకు ఫోన్ చేసి చెప్పగా.. వారొచ్చి దినేశ్ కారును అడ్డుకున్నారు. ఆ కారులోంచి బాలుడి మృతదేహం స్వాధీనం చేసుకున్నారు. ఐదుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. కాగా, సెప్టెంబరు 6న తొమ్మిదేళ్ల బాలుడిని బలిచ్చేందుకు వీరు ప్రయత్నించారని పోలీసుల దర్యాప్తులో తేలింది.

## పారిశుధ్య కార్మికులు ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలి

- ఎంపీడీఓ రాములు నాయక్
- పారిశుధ్య కార్మికుల ఆరోగ్యాన్ని పరిశీలించిన ఎంహెచ్ఓ డా. వంశీకృష్ణ



**ఆత్మకూరు (ఎం), సెప్టెంబర్ 27 (మనం న్యూస్) :** స్వచ్చత హి సేవ కార్యక్రమంలో భాగంగా మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్థానిక ఆత్మకూరు గ్రామ పంచాయతీ సిబ్బంది తో పాటు పరిసర గ్రామాల పంచాయతీ పారిశుధ్య కార్మికులకు ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేసి ఎంపీడీఓ రాములు నాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో నిత్యం పారిశుధ్యంతో సహవాసం చేసే పంచాయతీ పారిశుధ్య కార్మికులు ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని, వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి అని కోరారు. ఎంహెచ్ఓ డా.వంశీకృష్ణ గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికుల ఆరోగ్యాన్ని పరిశీలించి వారి రక్త సాంపిల్స్ ను సేకరించి, పరీక్షల నిమిత్తం ల్యాబ్ పంపించి, అవసరమైన మందులను పారిశుధ్య కార్మికులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ సూపరిండెంట్ లోకేశ్వర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి ఆనంద్ కుమార్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ కరుణాకర్, బిల్ కలెక్టర్ సుదర్శన్, ఏఎన్ఎం మమత, ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది, మరియు గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## మహా సమ్మేళనానికి తరలిన ఉద్యమకారులు



**మహాదేవపూర్,సెప్టెంబర్ 27 (మనం న్యూస్) :** హైదరాబాద్ లో నిర్వహించే ఉద్యమ కారుల మహా సమ్మేళనానికి తెలంగాణా ఉద్యమ కారుల ఫోరం రాష్ట్ర నాయకుడు ఆయుభోద్దీన్ ఆధ్వర్యంలో మహాదేవపూర్ మండల నాయకులు తరలివెళ్లారు. టియుఎఫ్ ఆధ్వర్యంలో ఇటీవల ఎమ్మెల్సీ పదవీ బాధ్యతలు స్వీకరించిన ప్రొఫెసర్ కోదండరాం ను ఆయన నివాసం లో మర్యాదపూర్వకంగా కలిసి ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఉద్యమకారులకు అండగా ఉండాలని ఆయనకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమం లో టియుఎఫ్ మండల శాఖ అధ్యక్షులు సట్ల సత్యనారాయణ. ప్రధాన కార్యదర్శి కలికోట దేవేందర్. ఉద్యమకారులు ఆన్కారి ప్రభాకర్. అక్రమోద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# కొత్తగా 24 పార్లమెంటరీ కమిటీల ఏర్పాటు

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 27 (మనం న్యూస్):** రక్షణశాఖకు చెందిన పార్లమెంటరీ కమిటీలో ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీకి సభ్యత్వం లభించింది. బీజేపీ ఎంపీ కంగనా రనౌత్‌కు కమ్యూనికేషన్లు, ఐటీ కమిటీలో చోటు దక్కింది. ఇదే కమిటీలో తృణమూల్ కు చెందిన ఫైర్‌బ్రాండ్ ఎంపీ మహువా మొయిత్రాకు స్థానం లభించడం విశేషం. పార్లమెంటరీ స్థాయీ సంఘాలను పునర్ వ్యవస్థీకరిస్తూ 24 కొత్త కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ వివరాలను శుక్రవారం లోక్‌సభ సెక్రటేరియట్ వెల్లడించింది. కీలకమైన రక్షణశాఖ కమిటీ చైర్మన్‌గా రాధామోహన్ సింగ్, కమ్యూనికేషన్స్ అండ్ ఐటీ కమిటీ చైర్మన్‌గా నిశికాంత్ దూబే, హోం కమిటీ చైర్మన్‌గా రాధామోహన్ దాస్, ఆర్థిక వ్యవహారాల కమిటీ చైర్మన్‌గా భర్తృహరి నియమితులయ్యారు. వీరందరూ అధికారపక్షమైన బీజేపీ ఎంపీలు. నాలుగు కమిటీలకు ప్రతిపక్ష కాంగ్రెస్ సారథ్యం వహించనుంది. వాటిలో మహిళలు, విద్య, యువజన క్రీడా వ్యవహారాల కమిటీ (దిగ్విజయ్ సింగ్), విదేశీ వ్యవహారాల కమిటీ (శశిథరూర్), గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ కమిటీ (సప్తగిరి శంకర్ ఉలాకా), వ్యవసాయం, పశుపోషణ, ఆహార ఉత్పత్తి కమిటీ (చరణ్‌జిత్‌సింగ్) ఉన్నాయి. కాగా తెలంగాణ, ఏపీకి చెందిన పలువురు ఎంపీలకు వివిధ కమిటీల్లో సభ్యత్వంతోపాటు సారథ్య బాధ్యతలు కూడా లభించాయి. టీడీపీ ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి గృహ, పట్టణ వ్యవహారాల కమిటీ చైర్మన్‌గా, బీజేపీ రాజ్యసభ సభ్యుడు సీఎం రమేశ్ రైల్వే కమిటీ చైర్మన్‌గా నియమితులయ్యారు. విదేశీ వ్యవహారాల కమిటీలో డీకే అరుణ, కే.లక్ష్మణ్, అసదుద్దీన్ ఒవైసీలకు, వాణిజ్య కమిటీలో రేణుకాచౌదరికి, రసాయనాలు, ఎరువుల కమిటీలో ఈటల రాజేందర్, ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం కమిటీలో కడియం కావ్యకు సభ్యత్వం లభించింది.

### కమిటీల్లో తెలుగు ఎంపీలు

వాణిజ్యశాఖ– రేణుకా చౌదరి, శ్రీ భరత్; హోంశాఖ, రక్షణ శాఖ కమిటీలు– కేశినేని శివనాథ్; మహిళలు, పిల్లలు, యువజనులు, క్రీడలు– దగ్గుబాటి పురంధేశ్వరి; పరిశ్రమలు– గొల్లబాబూరావు, అరవింద్ ధర్మపురి, మల్లురవి, కొండావిశ్వేశ్వర్ రెడ్డి; సైన్స్ అండ్ టెక్నాలజీ, పర్యావరణ, అటవీ శాఖ– వంశీకృష్ణ గడ్డం, దామోదర రావు దివకొండ, పరిమళ్ నత్వానీ; రవాణా, పర్యాటక రంగం, సాంస్కృతికం– తంగెళ్ల ఉద



య్ శ్రీనివాస్, సురేశ్ షేట్కర్, వి.విజయసాయిరెడ్డి; ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం– డాక్టర్ కడియం కావ్య, బైరెడ్డి శబరి, బి. పార్థసారథి రెడ్డి; సిబ్బంది, ప్రజాసమస్యలు, న్యాయశాఖ–ఎం.రఘునందన్‌రావు, కె.ఆర్ సురేశ్‌రెడ్డి; కమ్యూనికేషన్లు, ఐటీ–రామసహాయం రఘురాం రెడ్డి, ఎస్.నిరంజన్ రెడ్డి, కలిశెట్టి అప్పలనాయుడు; ఇంధనశాఖ– కుందూరు రఘువీర్; విదేశీ వ్యవహారాలు– డీకే అరుణ, అసదుద్దీన్ ఒవైసీ, వైఎస్ అవినాశ్ రెడ్డి, కే.లక్ష్మణ్; ఆర్థిక మంత్రిత్వశాఖ కమిటీ– లావు శ్రీ కృష్ణదేవరాయలు, సీఎం రమేశ్, పీవీ మిథున్ రెడ్డి, వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, వల్లభనేని బాలశౌరి, వైవీ సుబ్బారెడ్డి; కార్మిక, జౌళి, నైపుణ్యాభివృద్ధి– జీఎం హరీశ్ బాలయోగి, జి.లక్ష్మీనారాయణ; పెట్రోలియం, సహజవాయువు– వల్లభనేని బాలశౌరి, వద్దిరాజు రవిచంద్ర, ఎం గురుమూర్తి, పుట్టా మహేశ్కుమార్; రైల్వే కమిటీ– సీఎం రమేశ్, కే.లక్ష్మణ్, గృహ, పట్టణ వ్యవహారాలు– మాగుంట శ్రీనివాసులు రెడ్డి, చామల కిరణ్ కుమార్ రెడ్డి, అయోధ్య రామిరెడ్డి; రసాయనాలు, ఎరువులు – ఈటల రాజేందర్, దగ్గుమళ్ల ప్రసాదరావు, మేడా రఘునాథ రెడ్డి, బలరాం నాయక్; బొగ్గు, గనులు, ఉక్కు – బీకే పార్థసారథి, అనిల్ కుమార్ యాదవ్ మందాడి; సామాజిక న్యాయం, సాధికారికత– గోడం నగేశ్; హోంశాఖ– తెన్నేటి కృష్ణ ప్రసాద్

# కర్ణాటక సీఎంపై లోకాయుక్తలో కేసు

**బెంగళూరు, సెప్టెంబరు 27 :** ముడా ఇంటి స్థలాల వివాదంపై విచారణ జరిపేందుకు హైకోర్టు, ప్రజా ప్రతినిధుల కోర్టులు అనుమతులు ఇవ్వడంతో మైసూరు లోకాయుక్త ఎస్పీ ఉదేశ్ శుక్రవారం ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. సీఎం సిద్ధరామయ్యను ఏ1గాను, ఆయన భార్య పార్వతి ఏ2గాను, బావమరిది మల్లికార్జున ఏ3గాను, భూయజమాని దేవరాజు ఏ4గానూ చేర్చారు. ఏ5గా ఇతరులను పేర్కొన్నారు. సీఆర్పీసీ సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని కోర్టు ఆదేశించింది. అందుకు అనుగుణంగానే ఐపీసీ, అవినీతి నియంత్రణ చట్టం, బినామీ ఆస్తుల లావాదేవీలు, భూ ఆక్రమణల నిర్బంధ చట్టం కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఐపీసీ 120బి, 166, 403, 420, 426, 465, 468, 340, 351 సెక్షన్ల కింద, అవినీతి నియంత్రణ చట్టం 1988 నిబంధనలకు అనుగుణంగా ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. సీఎంపై ఎఫ్ఐఆర్ నమోదు విషయంలో మైసూరు లోకాయుక్త ఎస్పీ ఆచితూచి వ్యవహరించారు. భారతీయ న్యాయ సంహిత లేదా సీఆర్పీసీల కింద నమోదు, కోర్టు నిబంధనలు... వంటి అంశాలపై లోకాయుక్త ఉన్నతాధికారులతో చర్చించేందుకు గురువారం బెంగళూరుకు వచ్చారు. సమగ్ర చర్చల అనంతరం శుక్రవారం ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. మూడు రోజుల మైసూరు పర్యటనకు శుక్రవారం సీఎం సిద్ధరామయ్య వెళ్లిన సమయంలోనే ఎఫ్ఐఆర్ నమోదైంది. లోకాయుక్త అధికారులు దర్యాప్తు ఎప్పుడు ప్రారంభిస్తారనేది తెలియాల్సి ఉంది.

మరోవైపు 'సిద్ధరామయ్య ఈ రోజు సీఎంగా ఉన్నారు.. రేపు ఉండకపోవచ్చు..! ఆయనపై వ్యక్తిగతమైన ఆరోపణలు వచ్చినా బీజేపీ ఏకంగా కాంగ్రెస్‌పార్టీని డ్యామేజ్ చేసే ప్రయత్నం చేస్తోంది' అని ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే మండిపడ్డారు. బెంగళూరులో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. సీఎం ఎవరైనా పార్టీ ప్రతిష్ఠ ముఖ్యమన్నారు. పార్టీ ముందు ఎవరూ గొప్ప కాదని అన్నారు. సిద్ధరామయ్యపై లోకాయుక్త విచారణకు సంబంధించి మాట్లాడుతూ గోద్రా సంఘటన జరిగినప్పుడు నరేంద్రమోదీ సీఎం పదవికి రాజీనామా చేశారా? అని ప్రశ్నించారు. ముడా వివాదంలో చట్టపరంగా పోరాటం చేస్తామని అన్నారు. సిద్ధరామయ్యకు పార్టీ అధిష్ఠానం మద్దతు ఎప్పుడూ ఉంటుందని, ఆయన పార్టీ ప్రతినిధి అని స్పష్టం చేశారు. కాగా, రాష్ట్రంలో నేరుగా సీబీఐ విచారణకు అనుమతి రద్దు చేయడం కొత్తేమీ కాదని, దేవరాజ్ సీఎంగా ఉన్నప్పుడు కూడా చేశారని అన్నారు.

మరోవైపు, ముడా భూ కుంభకోణం నేపథ్యంలో కర్ణాటకలో కేసుల విచారణకు సీబీఐకి అనుమతి ఉపసంహరించుకుంటూ ఆ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని బీజేపీ తప్పుపట్టింది. ఇది 'ప్రొఫెషనల్ దొంగ, ఓ అవినీతి పార్టీ' తీసుకున్న నిర్ణయమని బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి షెహజాద్ పూనావాలా అభివర్ణించారు. 5 వేల కోట్ల ముడా స్కామ్‌లో సీఎం సిద్ధరామయ్య సీబీఐ విచారణ నుంచి తప్పించుకునేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని విమర్శించారు.

# ఎల్బీనగర్ జోన్‌లో ఏక్ నిరంజన్

- ఇద్దరు ఉండాల్సిన చోట ఒకరే టౌన్ ప్లానింగ్ ఏసీపీ
- పని భారం పెరగడంతో నత్తనడకన పనులు
- అదనుగా భావించి రెచ్చిపోతున్న అక్రమార్కులు
- ఆదాయానికి గండిపడుతున్న పట్టించుకోని బల్దియా
- 3 నియోజకవర్గాలు,5 సర్కిళ్ళ నిర్వహణలో సవాళ్ళు




**రంగారెడ్డి, సెప్టెంబర్ 27 (మనం న్యూస్) :** జిహెచ్ఎంసీలో టౌన్ ప్లానింగ్ విభాగం కీలకమైంది. అటువంటి విభాగంలో సిబ్బంది కొరత ఏర్పడితే అక్రమ నిర్మాణాలకు అడ్డుఅదుపు ఉండదు. అంతేకాకుండా పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చే కట్టడాలు, ఆక్రమణలతో ప్రజలకు ఇబ్బందులు తప్పవు.అందులోనూ జిహెచ్ఎంసీకి ఆదాయం తెచ్చిపెట్టే విభాగాల్లో ఒకటిగా టౌన్ ప్లానింగ్ విభాగాన్ని భావిస్తారు.అటువంటి విభాగం ఎల్బీనగర్ జోనులో బలహీనపడినట్లుగా కనిపిస్తోంది. జోనల్ కార్యాలయంలో ఇద్దరు టౌన్ ప్లానింగ్ ఏసీపీలు ఉండాల్సిన చోట ఒకరే ఉండడం కొత్త సమస్యలను తెచ్చిపెడుతున్నట్లుగా తెలుస్తోంది.కీలక అధికారులే కాకుండా సిబ్బంది కొరత కూడా వేధిస్తున్నట్లు చర్చ జరుగుతోంది.దీంతో కీలకమైన ఈ విభాగంలో పనిభారం పెరిగిన కారణంగా పనులు నత్తనడక సాగుతున్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.నిర్మాణ అనుమతుల కోసం వచ్చే ప్రజలు ఆలస్యాన్ని ఎదుర్కోవాల్సిన దుస్థితి ఏర్పడుతోంది.సిబ్బంది కొరత కారణంగా అక్రమ నిర్మాణాల పర్యవేక్షణలో లోపాలు వెలికి వస్తున్నాయి.అంతేకాకుండా అభివృద్ధి పనులు కూడా మందగిస్తున్నాయనే మాటలు వినిపిస్తున్నాయి.

### జోన్ కార్యాలయంలో, సర్కిల్ కార్యాలయంలో అదే పరిస్థితి

ఎల్బీనగర్ జోన్ కార్యాలయం పట్టణ ప్రణాళిక విభాగంలోని ఏసీపీ కూడా సిబ్బంది కొరతను ఎదుర్కొంటున్నట్లు సమాచారం.అయితే జోనల్ కార్యాలయంలోని సర్కిల్లు కాప్రా, ఉప్పల్, హయత్ నగర్, ఎల్బీ నగర్, సరూర్ నగర్ కి కూడా ఒక్కరే ఏసీపీ కావడంతో పని భారం తీవ్రంగా పెరిగిపోతుంది. అదేవిధంగా ఎల్బీ నగర్, సరూర్ నగర్ కి కూడా ఒక్కరే ఏసీపీ ఉన్నారు. హయత్ నగర్,ఎల్బీ నగర్ రెండు సర్కిళ్ళకి కలిపి మొత్తంగా ఎనిమిది డివిజన్లకు ఒక్కరే టీపీఎస్ గా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. రెండు సర్కిళ్ళకి ఒక్కరే సెక్షన్ అధికారి కావడంతో అనుమతులు,ఫిర్యాదులపై స్పందించడంలో జాప్యం జరుగుతుందనే భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అధిక పని భారం,రాజకీయ నాయకుల ఒత్తిళ్ళ నడుమ అధికారులు సైతం తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడిందనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి.




రెచ్చిపోతున్న అక్రమార్కులు

అధికారుల సంఖ్య అనుగుణంగా లేకపోవడం,సిబ్బంది కొరత ఉండడం కొందరు అక్రమార్కులకు అవకాశంగా మారిందని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇదే అదనుగా భావించిన సదరు అక్రమార్కులు ఇష్టారీతిన నిర్మాణాలు చేపడుతున్నట్లు జనం కోడై కూస్తున్నారు.అక్కడ ఇక్కడ అని కాకుండా ఎక్కడ పడితే అక్కడ తమ బుద్ధికి పని చెబుతున్నట్లు పలువురు విమర్శలు గుప్పిస్తున్నారు. ఎందుకంటే ఇప్పటికిప్పుడు తనిఖీలు చేసి చర్యలు తీసుకునేందుకు ఎల్బీనగర్ జోన్ లో బల్దియాకు సిబ్బంది లేకపోవడమే అనే వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. అందుకు అనుగుణంగా అక్రమ నిర్మాణాలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి.

### పట్టించుకోని బల్దియా

ఎల్బీనగర్ జోన్ పరిధిలో మూడు నియోజకవర్గాలు, 5 సర్కిళ్ళు ఉండగా అందుకు కావాల్సిన అధికార యంత్రాంగం, సిబ్బంది మాత్రం అందుబాటులో లేకపోవడం పట్ల భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.కేవలం ప్రజలకు ఇబ్బందులు కలగడమే కాకుండా జిహెచ్ఎంసీ ఆదాయానికి కుడా గండి పడుతోందనే వాదనను పలువురు బలంగా వినిపిస్తున్నారు.అటు అక్రమాలను అడ్డుకోలేక, ఇటు ఆదాయాన్ని కోల్పోతున్నా బల్దియా ఉన్నతాధికారులు మాత్రం పట్టించుకోకపోవడం పట్ల ప్రజలు విస్మయం వ్యక్త పరుస్తున్నారు. ఇప్పటికైనా వారు కలుగజేసుకొని తగినంత సిబ్బందిని భర్తీ చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

### సిబ్బంది కొరత వాస్తవమే
### జోనల్ సిటీ ప్లానర్ శ్రీనివాస్ యాదవ్


సిబ్బంది కొరత ఉండడం వాస్తవమే. తద్వారా అధికారులపై తీవ్రంగా పని భారం పడుతోంది.తగినంత సిబ్బంది కావాలని ఉన్నతాధికారులను సమాచారం ఇచ్చాము. త్వరలోనే పూర్తిస్థాయి అధికారుల నియామకం జరుగుతుందని జోనల్ సిటీ ప్లానర్ శ్రీనివాస్ యాదవ్ చెప్పుకొచ్చారు.

## పథకాలకు నిధులివ్వండి

మొదటి పేజీతరువాయి...

జగరనున్న బహిరంగ సభలో పాల్గొనవలసిందిగా సోనియాను ఆయన ఆహ్వానించారు. ఈ సభకు ప్రతిపక్ష ఇండియా కూటమికి చెందిన నాయకులు హాజరుకానున్నారు.

## ఎంఎస్పీకి నిర్వచనం తెలుసా రాహుల్ ?




**అమిత్ షా ఎద్దేవా**

**రేవారి(హర్యానా), సెప్టెంబర్ 27 :** లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ఎంఎస్పి(కనీస మద్దతు ధర) పూర్తి నిర్వచనం ఏమిటో కూడా రాహుల్‌కు తెలియదంటూ ఆయన ఎద్దేవా చేశారు. హర్యానాలోని బిజెపి ప్రభుత్వం 24 పంటలను కనీస మద్దతు ధరపై సేకరిస్తోందని షా చెప్పారు. శుక్రవారం నాడిక్కడ ఒక ఎన్నికల ప్రచార సభలో అమిత్ షా ప్రసంగిస్తూ ఎంఎస్పిని ప్రస్తావిస్తే మనకు ఓట్లు వస్తాయని ఏదో ఎన్జిఓ రాహుల్‌కు చెప్పిందని అన్నారు. ఎంఎస్పికి పూర్తి నిర్వచనం ఏమిటో తెలుసా రాహుల్ బాబా అంటూ ఆయన ప్రశ్నించారు. ఖరీఫ్‌లో ఏఏ పంటలు ఉంటాయి..రబీలో ఏఏ పంటలు ఉంటాయో తెలుసా అంటూ ఆయన నిలదీశారు. హర్యానాలో రైతుల నుంచి 24 పంటలను ఎంఎస్పితో ప్రభుత్వం సేకరిస్తోందని, కాంగ్రెస్ పాలిత ఏ రాష్ట్రం ఇన్ని పంటలను ఎంఎస్పితో కొనుగోలు చేస్తోందో హర్యానాలోని కాంగ్రెస్ నాయకులు చెప్పాలని ఆయన డిమాండు చేశారు. కర్నాటక, తెలంగాణలో ఎంఎస్పితో ఎన్ని పంటలను కొనుగోలు చేస్తున్నారని హోం మంత్రి ప్రశ్నించారు. కాంగ్రెస్ హయాంలో క్వింటాలుకు రూ. 1300 రేటుపై ధాన్యం కొనుగోలు చేసేవారని, కాని ఇప్పుడు క్వింటాలకు రూ. 2,300 ఇస్తున్నామని ఆయన తెలిపారు. హర్యానాలో బిజెపి ప్రభుత్వాన్ని ఎన్నుకుంటే క్వింటాలకు రూ. 3,100 చెల్లిస్తామని ఆయన హామీ ఇచ్చారు. దీర్ఘకాలంగా పెండింగ్లో ఉన్న ఒక ర్యాంకు, ఒక పెన్షన్ డిమాండును నరేంద్ర మోడీ ప్రభుత్వం నెరవేర్చిందని ఆయన తెలిపారు. హర్యానాలో సమన్యాయం అందచేసే పాలనను అందించామని ఆయన తెలిపారు. గత పదేళ్లలో అవినీతిని అంతం చేశామని ఆయన చెప్పారు. గతంలో హర్యానాలో కాంగ్రెస్ ప్రభుత్వాలు కమీషన్లు, అవినీతి, ప్రాతిపదికన నడిచేవని, డీలర్లు, దళారులు, అల్లుళ్లు రాష్ట్రాన్ని పాలించేవారని కాని ఇప్పుడు డీలర్లు, దళారులు, అల్లుళ్లు లేరని ఆయన వ్యాఖ్యానించారు. అక్టోబర్ 5న హర్యానా అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. అక్టోబర్ 8న ఫలితాలు వెలువడనున్నాయి.

## గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో సన్మానం



**భువనగిరి, సెప్టెంబర్ 27 (మనం న్యూస్) :** భువనగిరి గణేష్ ఉత్సవ సమితి అధ్యక్షులు రత్నాపురం శ్రీశైలం ఆధ్వర్యంలో శుక్రవారం భువనగిరి మున్సిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు, కమిషనర్ రామాంజుల రెడ్డిని కలిసి సన్మానించి మెమొంటోని అందించడం జరిగింది. భువనగిరి గణేష్ ఉత్సవ సమితి అధ్యక్షులు రత్నపురం శ్రీశైలం మాట్లాడుతూ నవరాత్రులలో భువనగిరి పట్టణమంతా పరిశుభ్రం చేసి, గణేష్ మండపాల వద్ద ప్రతిరోజు శుభ్రపరుస్తూ భువనగిరి పట్టణ మంతా, రోడ్ల పైన, పెద్ద చెరువు వద్ద ప్రత్యేకమైన ఏర్పాట్లు నిర్వహించి రోడ్డుకు అడ్డంగా ఉన్న చెట్లను కొమ్మలను తొలగించి, భువనగిరి పట్టణ ప్రజలంతా సంతోషంగా నవరాత్రి వేడుకలను ఘనంగా నిర్వహించుకోవాలని ఏర్పాట్లను నిర్వహించిన మున్సిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు, కమిషనర్ రామాంజుల రెడ్డికి అదేవిధంగా శానిటేషన్ ఇన్స్పెక్టర్ మరియు జవాన్లు వారందరినీ సన్మానించి గణేష్ ఉత్సవ సమితి తరపున ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గణేష్ ఉత్సవ సమితి గౌరవ సలహాదారులు దేవరకొండ నరసింహచారి, ఉపాధ్యక్షులు నామోజు రాజు, తాడూరి రాజ్ కుమార్, కానుకంటి ప్రేమ్, ప్రధాన కార్యదర్శి రాళ్ల బండి కృష్ణ చారి, కోశాధికారి కోకల రవీందర్, కానుకుంట్ల రమేష్, కోటి, కాలియా మరియు తదితరులు పాల్గొన్నారు.

## చాయ్‌వాలాతో సెల్ఫీలు.. మమ్మల్ని పట్టించుకోలే!

- భారత హాకీ ప్లేయర్ హార్దిక్ ఆవేదన



ఒలింపిక్స్‌లో వరుసగా రెండో కాంస్యం గెలిచిన భారత జట్టులో సభ్యుడిగా ఉన్న హాకీ ప్లేయర్ హార్దిక్సింగ్ తమకు రావాల్సిన గుర్తింపు రాలేదని ఆవేదన వ్యక్తం చేశాడు. ఇంటర్నెట్ సంచలనం 'డాలీ చాయ్‌వాలా'కు ఉన్న గుర్తింపు సైతం తమకు లేదని, జాతీయ జట్టుకు ఏండ్లుగా ఆడుతున్నా అభిమానులు తమను కనీసం పట్టించుకోలేదని తెలిపాడు. ఓ పాడ్‌కాస్ట్‌లో హార్దిక్ మాట్లాడుతూ.. 'నేను నా సొంత కళ్లతో చూసిన విషయా న్ని మీకు చెబుతున్నాను. పారిస్‌లో కాంస్య పతకం గెలిచి స్వదేశానికి తిరిగొచ్చిన మా బృందంలో నేను, హర్మన్‌ప్రీత్ సింగ్, మనీదీప్‌సింగ్‌తో పాటు ఐదారుగురం ఒకేచోట ఉన్నాం. మాతో పాటు డాలీ చాయ్‌వాలా కూడా అక్కడే ఉన్నాడు. అక్కడికి వచ్చిన ప్రజలు అతడితో సెల్ఫీలు తీసుకోవడానికి ఎగబడుతున్నారు. కనీసం మమ్మల్ని పట్టించుకునే నాథుడే కనిపించలేదు. ఇది చూసి మాకు ఒకింత ఇబ్బందిగా అనిపించింది. ఒక అథ్లెట్‌కు పేరు, డబ్బు కంటే అభిమానుల నుంచి గుర్తింపు దక్కినప్పుడు ఆ ఆనందాన్ని మాటల్లో వ్యక్తపరచలేము. ఏ అవార్డు దానికి సరితూగదు' అంటూ ఆవేదన చెందాడు.

## 2025 ప్రపంచ ఛాంపియషిప్ లక్ష్యం

2025 టోక్యో ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో పతకం సాధించడమే తన లక్ష్యమని భారత స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా తెలిపాడు. కొత్త సీజన్లో 100 శాతం ఫిట్‌నెస్‌తో ఉంటానని చెప్పాడు. పారిస్ ఒలింపిక్స్‌లో రజతం.. బ్రస్సెల్స్ డైమండ్ లీగ్ ఫైనల్లో ద్వితీయ స్థానంతో సీజన్‌ను ముగించిన నీరజ్ శుక్రవారం భారత్‌కు తిరిగొచ్చాడు. ''ఇప్పుడు సీజన్ ముగిసింది. వచ్చే ఏడాది ప్రపంచ ఛాంపియన్‌షిప్ అతిపెద్ద లక్ష్యం. అందుకోసం సన్నాహాలు ప్రారంభిస్తాం. ఒలింపిక్స్ ఎప్పుడూ మదిలోనే ఉంటుంది. విశ్వ క్రీడలకు ఇంకా నాలుగేళ్ల సమయం ఉంది. ఇప్పుడు గాయంతో ఇబ్బంది పడట్లేదు. కొత్త సీజన్‌లో 100 శాతం ఫిట్నెస్తో ఉంటా. కొన్ని సాంకేతిక సమ స్యలు ఉన్నాయి. వాటిపై పనిచేస్తాం. నా టెక్నిక్‌ను మెరుగు పరుచుకుంటా. భారత్‌లోనే శిక్షణ తీసుకుంటా. కాని పోటీలు ప్రారంభమైతే విదేశాల్లో తర్ఫీదు పొందుతా'' అని నీరజ్ వివరించాడు.

# కాన్పూర్ టెస్టుకు వర్షం అడ్డంకి



సొంతగడ్డపై బంగ్లాదేశ్‌ను రెండో టెస్టులోనూ ఆదిలోనే దెబ్బకొట్టి ఆధిపత్యం చెలాయించాలని చూసిన భారత క్రికెట్ జట్టు ఆశలపై వరుణుడు నీళ్లు చల్లాడు. కాన్పూర్లోని గ్రీన్ పార్క్ స్టేడియం వేదికగా శుక్రవారం మొదలైన రెండో టెస్టుకు వరుణుడు పదే పదే అంతరాయం కల్పించాడు. వెలుతురు లేకపోవడం, వర్షం కారణంగా తొలి రోజు 35 ఓవర్ల ఆట మాత్రమే సాధ్యపడింది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేస్తున్న బంగ్లాదేశ్.. 3 వికెట్ల నష్టానికి 107 పరుగులు చేసింది. మోమినుల్ హక్ (40 బ్యాటింగ్, 7 ఫోర్లు), ముష్ఫికర్ రహీమ్ (6 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. భారత బౌలర్లలో ఆకాశ్‌దీప్ (2/34) రాణించాడు.

### గంటన్నర ఆలస్యంగా..

కాన్పూర్‌లో గురువారం రాత్రి వర్షం కురవడంతో గ్రీన్ పార్క్ మైదానం ఔట్ ఫీల్ చిత్తడిగా మారింది. దీంతో మ్యాచ్ నిర్ణీత సమయానికంటే గంట (ఉదయం 10:30 గంటలకు) ఆలస్యంగా ప్రారంభమైంది. టాస్ గెలిచిన రోహిత్.. ఆశ్చర్యకరంగా ఫీల్డింగ్ (స్వదేశంలో టెస్టు ఆడుతూ టాస్ గెలిచి భారత్ ఫీల్డింగ్ చేయడం 2015 తర్వాత ఇదే మొదటిసారి) ఎంచుకోవడంతో పాటు ముగ్గురు సీమర్లతో బరిలోకి దిగింది. కాన్పూర్ పిచ్ మ్యాచ్ సాగుతున్న కొద్దీ స్పిన్నర్లకు అనుకూలిస్తుందని భావించినా రోహిత్ మాత్రం తొలి టెస్టులో ఆడిన జట్టుతోనే బరిలోకి దిగాడు. ఆట ఆరంభమయ్యాక బుమ్రా, సిరాజ్ కట్టుదిట్టమైన బౌలింగ్‌కు బంగ్లా ఆచితూచి ఆడింది. ఓపెనర్లు షద్మాన్ ఇస్లాం (24), జకీర్ హసన్ (0) డిఫెన్స్‌కు ప్రాధాన్యమిచ్చారు. జకీర్ అయితే వికెట్ కాపాడుకోవడానికి నానా తంటాలు పడ్డాడు.

### బ్రేక్ ఇచ్చిన ఆకాశ్..

బంగ్లా ఇన్నింగ్స్ 9వ ఓవర్లో బంతిని ఆకాశ్‌దీప్‌నకు అందించిన రోహిత్ నమ్మకాన్ని అతడు వమ్ము చేయలేదు. తన తొలి ఓవర్ మూడో బంతికే అతడు.. జకీర్ను పెవిలియన్‌కు పంపి భారత్‌కు తొలి బ్రేక్ ఇచ్చాడు. జకీర్ ఇచ్చిన క్యాచ్‌ను గల్లీలో జైస్వాల్ ముందుకు డైవ్ చేస్తూ అద్భుతంగా అందుకున్నాడు. తన మూడో ఓవర్లో ఆకాశ్.. మరో ఓపెనర్ షద్నామ్‌ను వికెట్ల ముందు దొరకబుచ్చుకున్నాడు. ఈ క్రమంలో బ్యాటింగ్‌కు వచ్చిన బంగ్లా సారథి నజ్ముల్ హొసెన్ శాంతో (31, 6 ఫోర్లు) ఆరంభంలో రెండు ఫోర్లు కొట్టి తన ఉద్దేశాన్ని చాటాడు. లంచ్ సమయానికి ఆ జట్టు స్కోరు 74/2గా ఉంది. ఆటగాళ్లు లంచ్‌కు వెళ్తున్న సమయంలోనే వర్షం రావడంతో రెండో సెషన్ 20 నిమిషాలు ఆలస్యంగా ప్రారంభమైంది. వర్షం తగ్గాక బ్యాటింగ్‌కు వచ్చిన బంగ్లా.. లంచ్ తర్వాత మూడో ఓవర్‌లో శాంతో వికెట్‌ను కోల్పోయింది. క్రీజులో కుదురుకుంటున్న శాంతోను అశ్విన్ వికెట్ల ముందు బలిగొన్నాడు.

### మళ్లీ వర్షం..

శాంతో నిష్క్రమించిన తర్వాత ఐదు ఓవర్లకు వెలుతురు సరిగ్గా లేకపోవడంతో అంపైర్లు కొద్దిసేపు ఆటను నిలిపేశారు. అదే సమయంలో మొదలైన వర్షం ఎంతకూ తగ్గకపోవడంతో తొలి రోజు ఆటను నిలిపే స్తున్నట్టు అంపైర్లు ప్రకటించారు. 2 శాంతోను ఔట్ చేయడం ద్వారా ఆసియాలో అత్యధిక వికెట్లు తీసిన రెండో బౌలర్ (420)గా అశ్విన్ నిలిచాడు. ఈ క్రమంలో అతడు కుంబ్లే (419)ను దాటేశాడు. మురళీధరన్ (612) అగ్రస్థానంలో ఉన్నాడు.

### ఆస్పత్రి పాలైన బంగ్లా 'సూపర్ ఫ్యాన్'

బంగ్లాదేశ్ క్రికెట్ జట్టు ఎక్కడికి వెళ్తే అక్కడికి వెళ్తూ ఒళ్లంతా పులిచారలు, చేతిలో ఆ దేశ జెండాను పట్టుకుని కనబడే సూపర్ ఫ్యాన్ 'టైగర్ రాబీ' శుక్రవారం దవాఖాన పాలయ్యాడు. రెండో టెస్టు సందర్భంగా స్టాండ్ 'సీ'లో ఉన్న అతడు ఉన్నట్టుండి అస్వస్థతకు గురవడంతో అక్కడే ఉన్న పోలీసులు వెంటనే రాబీని స్థానిక ఆస్పత్రికి తరలించారు. 'మ్యాచ్ జరుగుతుండగా అతడు అస్వస్థతకు గురయ్యాడు. దీంతో వెంటనే అతడిని ఆస్పత్రికి తరలించాం. ప్రస్తుతం అతడి పరిస్థితి మెరుగ్గా ఉంది' అని కాన్పూర్ అడిషనల్ కమిషనర్ హరీష్ చందర్ తెలిపారు. కానీ అంతకు ముందు రాబీ అతడిపై ఎవరో దాడి చేశారని.. తన వీపుతో పాటు పక్కటెముకల మీద ఎవరో బలంగా కొట్టడంతో స్పృహ తప్పి పడిపోయానని చెప్పడం గమనార్హం.

## కెప్టెన్‌గా చరిత్ర సృష్టించిన రోహిత్ శర్మ.. 60 ఏళ్ల రికార్డ్ బద్దలు!



టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ చరిత్ర సృష్టించాడు. బంగ్లాదేశ్‌తో కాన్పూర్ వేదికగా జరుగుతున్న రెండో టెస్ట్‌తో అరుదైన ఘనతను సొంతం చేసుకున్నాడు.

ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన రోహిత్ శర్మ అనూహ్యంగా ఫీల్డింగ్ ఎంచుకున్నాడు. దాంతో 60 ఏళ్ల తర్వాత కాన్పూర్ వేదికగా ఓ టెస్ట్ మ్యాచ్‌లో టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న తొలి భారత కెప్టెన్‌గా నిలిచాడు.

1964లో మన్సూర్ అలీ ఖాన్ పటౌడీ.. కాన్పూర్ వేదికగా ఇంగ్లండ్‌తో జరిగిన మ్యాచ్‌లో చివరిసారిగా టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్నాడు. ఆ తర్వాత మరే భారత సారథి కాన్పూర్ వేదికగా టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకోలేదు. ఇన్నాళ్లకు రోహిత్ శర్మ ఆ పని చేసి చరిత్రకెక్కాడు. బంగ్లాదేశ్‌తో మ్యాచ్‌లోనూ టాస్ గెలిచిన జట్టు బ్యాటింగ్ ఎంచుకుంటుందని అంతా భావించారు. కానీ రోహిత్ శర్మ అనూహ్య నిర్ణయంతో అందరికి షాకిచ్చాడు.

గత 9 ఏళ్లలో భారత గడ్డపై ఓ టెస్ట్ మ్యాచ్‌లో టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకోవడం ఇదే తొలిసారి. 2015లో బెంగళూరు వేదికగా సౌతాఫ్రికాతో జరిగిన టెస్ట్ మ్యాచ్లో టీమిండియా టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకుంది. సాధారణంగా భారత్ గడ్డపై టాస్ గెలిచిన జట్లు ముందుగా బ్యాటింగ్ చేసేందుకు ఆసక్తి చూపుతాయి. స్పిన్‌కు అనుకూలంగా ఉండే వికెట్లపై నాలుగో ఇన్నింగ్స్ ఆడటం కష్టమవుతుందని ఈ పని చేస్తాయి.

ఈ మ్యాచ్‌లో టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన బంగ్లాదేశ్.. వర్షంతో మ్యాచ్ నిలిచిపోయే సమయానికి 35 ఓవర్లలో 3 వికెట్లకు 107 పరుగులు చేసింది. క్రీజులో మోమినల్ హక్ (40 నాటౌట్), ముష్ఫికర్ రహీమ్(6 బ్యాటింగ్) ఉన్నారు. నజ్ముల్ హోస్సేన్ షాంటో(31), షెడ్మన్ ఇస్లామ్(24), జకీర్ హసన్(0) దారుణంగా విఫలమయ్యారు.

భారత బౌలర్లలో ఆకాశ్ దీప్ రెండు వికెట్లు తీయగా.. రవిచంద్రన్ అశ్విన్ ఓ వికెట్ పడగొట్టాడు. శనివారం కూడా వర్షం అంతరాయం కలిగించే అవకాశం ఉంది. మ్యాచ్ ప్రారంభమైన తొలి మూడు రోజులు వర్షం కురుస్తుందని ఇప్పటికే వాతావరణ శాఖ హెచ్చరించింది. భారత్ తుది జట్టులో ఎలాంటి మార్పులు లేకుండా విన్నింగ్ కాంబినేషన్‌ను కొనసాగించింది.

# మల్టీస్టారర్‌కి సన్నాహాలు?



తమిళనాట ఓ భారీ మల్టీస్టారర్‌కి రంగం సిద్ధమైంది. కోలీవుడ్ సమాచారం ప్రకారం శంకర్ దర్శకత్వంలో ఈ పాన్‌ఇండియా సినిమా తెరకెక్కనున్నది. ఇందులో విక్రమ్, సూర్య కలిసి నటిస్తారట. వీరిద్దరూ 21ఏండ్ల క్రితం 'పితామగన్' చిత్రంలో కలిసి నటించారు. బాలా దర్శకత్వంలో రూపొందిన ఆ చిత్రం ఘన విజయాన్ని అందుకుంది. తెలుగులో 'శివపుత్రుడు'గా విడుదలై ఇక్కడా అఖండ విజయాన్ని చవిచూసింది. మళ్లీ ఇన్నాళ్ల తర్వాత విక్రమ్, సూర్య తెరను పంచుకోబోతున్నారనే వార్త వారి అభిమానుల్లో చెప్పలేనంత ఆనందాన్ని ఇస్తున్నది. తమిళనాట ప్రాచుర్యం పొందిన 'వేల్పారి' అనే నవల ఆధారంగా శంకర్ ఈ చిత్రాన్ని తెరకెక్కించనున్నారట. మూడు భాగాలుగా ఈ సినిమా రానున్నదని తమిళ వర్గాలు కోడై కూస్తున్నాయి. వెయ్యికోట్ల భారీ బడ్జెట్‌తో మూడు భాగాలూ ఒకేసారి షూట్ చేసి, రెండు నెలల వ్యవధితో విడుదల చేయాలన్నది శంకర్ ప్లాన్ అట. అయితే.. ఇంత పెద్ద ప్రాజెక్ట్ పట్టాలెక్కాలంటే ముందు శంకర్‌కి అర్జంట్‌గా హిట్ అవసరం. రామ్‌చరణ్ హీరోగా ఆయన దర్శకత్వం వహించిన 'గేమ్‌చేంజర్' డిసెంబర్ 20న విడుదల కానుంది. ఈ సినిమా హిట్ అయితే, సూర్య, విక్రమ్‌ల సినిమాకు మార్గం సుగమం అయినట్టేనని పలువురు అభిప్రాయపడుతున్నారు.

## ఇందు రెబెకా వర్గీస్‌గా సాయిపల్లవి

ఇందు
రెబెకా వర్గీస్‌గా సాయిపల్లవి

శివకార్తికేయన్ హీరోగా నటిస్తున్న తాజా తమిళ చిత్రం 'అమరన్'. రాజ్‌కుమార్ పెరియసామి దర్శకుడు. సాయిపల్లవి కథానాయికగా నటిస్తున్నది. శివ్ అరూర్, రాహుల్ సింగ్ రాసిన 'ఇండియాస్ మోస్ట్ ఫియర్‌లెస్' అనే పుస్తకంలోని మేజర్ వరదరాజన్ అధ్యాయం ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. మేజర్ వరదరాజన్ పాత్రను శివకార్తికేయన్ పోషిస్తున్నారు. ఈ సినిమాలో ఇందు రెబెకా వర్గీస్‌గా సాయిపల్లవిని పరిచయం చేస్తూ ఇంట్రో వీడియోను విడుదల చేశారు. రిపబ్లిక్ డే పరేడ్‌తో మొదలైన ఈ ఇంట్రో వీడియో ఆద్యంతం ఆసక్తికరంగా సాగింది. ఇందులో సాయిపల్లవి తనదైన నటనతో కట్టిపడేసింది. సాయిపల్లవి, శివకార్తికేయన్ మధ్య కెమిస్ట్రీ ఆకట్టుకుంది. దేశభక్తి, సాహసం ప్రధానంగా ఈ సినిమా స్ఫూర్తివంతంగా సాగుతుందని, దీపావళి సందర్భంగా అక్టోబర్ 31న విడుదల చేస్తామని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రాన్ని శ్రేష్ట్ మూవీస్ పతాకంపై సుధాకర్ రెడ్డి, నిఖిత రెడ్డి తెలుగు రాష్ట్రాల్లో విడుదల చేయబోతున్నారు.



# ఎన్టీఆర్ వన్‌మ్యాన్‌షో 'దేవర'



దేవర'లో నా తమ్ముడు యాక్టింగ్‌తో అదరగొట్టాడు. ఇది ఎన్టీఆర్ వన్‌మ్యాన్ షో అని గర్వంగా చెబుతున్నా. ఇంతటి భారీ విజయాన్ని అందించిన ప్రేక్షకులకు ధన్యవాదాలు' అన్నారు కల్యాణ్‌రామ్. 'దేవర' చిత్రానికి ఆయన సమర్పకుడిగా వ్యవహరించారు. ఎన్టీఆర్ కథానాయకుడిగా కొరటాల శివ దర్శకత్వంలో రూపొందిన 'దేవర' చిత్రం శుక్రవారం ప్రపంచవ్యాప్తంగా విడుదలైంది. ఈ సందర్భంగా చిత్ర బృందం మీడియా సమావేశాన్ని నిర్వహించింది. దర్శకుడు కొరటాల శివ మాట్లాడుతూ 'మూడేళ్లుగా ఈ సినిమాతో ప్రయాణం సాగిస్తున్నా. నటీనటులు, సాంకేతిక నిపుణుల సహకారంతో 'దేవర' చిత్రం అద్భుతంగా రూపుదిద్దుకుంది. ఇది నా కెరీర్‌లోనే బెస్ట్ ఫిల్మ్ అని అందరూ మెచ్చుకుంటున్నారు' అని చెప్పారు. ఈ చిత్రానికి విదేశాల్లో కూడా అద్భుతమైన ఆదరణ లభిస్తున్నదని, ఎన్టీఆర్ నటన మరో స్థాయిలో ఉందని, ఇది ఆయన వన్‌మ్యాన్ షో అని నైజాంలో 'దేవర'ను డిస్ట్రిబ్యూట్ చేసిన అగ్ర నిర్మాత దిల్ రాజు పేర్కొన్నారు.

# వేరే కోణంలో చూడొద్దు ప్లీజ్..



డేటింగ్ యాప్‌లో సెలబ్రిటీల పేర్లు ప్రస్తుతం బీటౌన్లో చర్చనీయాంశం అయ్యింది. ఈ పేర్లలో బాలీవుడ్ భామ ఊర్వశీ రౌతేలా పేరు కూడా ఉండటంతో.. ఈ వ్యవహారంపై ఊర్వశీ స్పందించింది. 'కేవలం మేం మాట్లాడుకోవడం కోసమే ఈ యాప్‌లో లాగిన్ అయ్యాం. ఇందులో నాతోపాటు హృతిక్, ఆదిత్యరాయ్.. ఇలా చాలా మంది పేర్లున్నాయి. సమయం దొరికినప్పుడల్లా ఈ యాప్ ద్వారా మాట్లాడుకుంటూ ఉంటాం. లీజర్ టైమ్‌లో ఒకరికొకరం రిక్వెస్టులు పెట్టుకుంటాం. దయచేసి దీన్ని వేరే కోణంలో చూడొద్దు. ప్లీజ్..' అంటూ రిక్వెస్ట్ చేసింది ఊర్వశీ రౌతేలా. ప్రస్తుతం ఈ అందాలభామ టాలీవుడ్‌లో నటిస్తున్న విషయం తెలిసిందే. బాలకృష్ణ హీరోగా కేఎస్ రవీంద్ర(బాబీ) దర్శకత్వంలో రూపొందుతోన్న చిత్రంలో ఊర్వశి కీలక పాత్ర పోషిస్తున్నది. ఈ సినిమా గురించి ఇటీవల మాట్లాడుతూ 'బలమైన కథతో రూపొందుతోన్న చిత్రమిది. ఇందులో నా పాత్ర కొత్తగా ఉంటుంది. బాలయ్యసార్‌తో కలిసి పని చేయడం చాలా ఆనందంగా ఉంది. ఆయన గొప్ప నటుడు మాత్రమే కాదు, మంచి వ్యక్తి కూడా. టాలీవుడ్ వాతావరణం నాకెంతో నచ్చింది. ఇక్కడ మరిన్ని సినిమాలు చేయాలని ఉంది' అంటూ చెప్పుకొచ్చింది ఊర్వశీ రౌతేలా.

Printed and Published by **VUPPARI RAMESH KUMAR** on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises D.No: 3-88, Gosala village, Penamaluru Mandal, Krishna District 521151(AP), And Published at H.No. 23-3-46, 1st Floor, Katamaraju vari Veedhi, Amaravathi Road, Naidu pet, Guntur (District), AP-522002. **EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.APTEL/2016/73939.**